ప్రజాశక్తి

Vol. 4, no. 21

(May. 24, 1944)

బెజవాడ, 1944

Prajāśakti

Vol. 4, no. 21

(May. 24, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

# ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 21 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ ★ పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 24-5-44

## జనాబ్ జిన్నాకు మహాత్ముని లేఖ

★

ప్రియమైన ఖాయిదే ఆజం,

నన్ను డిటెన్షన్‌లో పెట్టిన కొన్నాళ్ళకు ఏయే వార్తా పత్రికలు మీకు కావాలని ప్రభుత్వంవారు నన్ను అడిగారు. అంతట నేను కోరిన పత్రికలలో మీ "డాన్" పత్రికకూడా వొకటి. డానావు ప్రతిరోజూకూడా అది నాకు చేరుచున్నది. నాకు చేరినప్పుడల్లా దాన్ని నేను శ్రద్ధతో చదువుతున్నాను. ముస్లింలీగ్ వార్షిక (లాహోర్) సమావేశాన్ని గురించి "డాన్" పత్రికలో ప్రకటించబడిన వార్తల్ని నేను చదివాను లేఖ వ్రాయవలసిందిగా నన్ను మీరు కోరినట్టుగా "డాన్" పత్రికలో పడిన వార్తలు గమనించాను. అందు మీదటనే ఈ ఉత్తరాన్ని వ్రాస్తున్నాను.

ఉత్తరాన్ని వ్రాయవలసిందిగా మీరు ప్రకటించిన కోర్కెను నేను హర్షిస్తున్నాను. ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా వ్యవహారాన్ని గురించి మాట్లాడటం కంటె మనం ముఖాముఖిగా కలుసుకోవడం ఉత్తమమని నా సూచన ఈ సూచన యొక్క మంచిచెడ్డల్ని నిర్ణయించడాన్ని మీకే వదిలివేస్తున్నాను. ఈ ఉత్తరాన్ని మీకు పంపగలరనీ, మీరు నా సూచనను ఆమోదిస్తే ప్రభుత్వంవారు మీరువచ్చి నన్ను కలుసుకోడానికి అనుమతించ గలరని ఆశిస్తున్నాను. ఇక్కడ నేనొక విషయాన్ని చెప్పడం మంచిది. ఒక షరతుపెట్టి మీరు నన్ను లేఖ వ్రాయమని కోరినట్టున్నారు. నాలో హృదయ పరివర్తనం కలిగిన పక్షంలోనే నేను మీకు లేఖ వ్రాయాలని మీ తాత్పర్యమా? కాని మానవహృదయాలలో నిగూఢమైవున్న విషయాలు ఆ పరాత్పరునికితప్ప, మరెవరికి తెలియగలవు? మంచో, చెడ్డో, నన్ను నన్నుగానే మీరు ఆమోదించాలని నా అభిలాష! పరిష్కార మార్గాన్ని కనుగొని తీరాలి! దానితో సంబంధం గలవారందరు దాన్ని ఆమోదించగల విధంగా కలసి పనిచెయ్యాలి! ఇట్టి దీక్షాసంకల్పంతో మనం వుభయులం మత సమస్యను ఎందుకు ఎదుర్కొనరాదు?

డిటెన్షన్ క్యాంపు, చిత్తగించండి,

4—5—1943 — యం. కె. గాంధి.

# పర్ణకుటి

నిఖిల్ చక్రవర్తి

●

మే నెల 6 వ తేదీ. శనివారం. ఉదయం 8 గంటలకు మహాత్ముడు విడుదల కానున్నాడనే వార్త నలుమూలల వ్యాపించింది. నేను, చిత్తప్రసాద్ క్షణం ఆలస్యం చేయకుండా పూనాకు బయలుదేరాం. ఎక్కడచూచినా అంతు లేని అడావిడి. జరగబోయే ఘటనల్ని గురించి తలకొక జోస్యం. అయినా, వార్త విన్నప్పటి మొదటి దిగ్భ్రమ ఇంకా వదలలేదు.

పర్ణకుటి సోపానాలు చేరేసరికి చీకటి పడుతూంది. సాయంత్రపు ప్రార్థన సమయమది. తన ప్రజలతోపాటు మహాత్ముడు మళ్ళీ ప్రార్థన జరపడానికిదే మొదటిసారి. చిన్నగుంపుఅప్పుడేచేరుకొంది. సువిశాలమైన డాబాపైని మహాత్ముడు కూర్చున్నాడు. మీరాబెన్, ప్యారీలాల్, మొదలైన ఆప్తులు చుట్టూ నిల్చున్నారు.

### ఫరవాలేదు

మహాత్ముడు ప్రార్థనా నిమగ్నుడై యున్నాడు. ప్రశాంతంగావున్న ఆయనముఖం చూస్తుంటే, గడచినరెండుసంవత్సరాలు విడిచిపోయిన ముద్రను గుర్తించగలిగాను. బయటికి మంచి ఆరోగ్యము, ఉత్సాహం కలిగి, ఏమీ ఫరవాలేదన్నట్టే కనబడుతున్నారు. కాని వారి రక్తపుపోటు మొదలయినవాటినిగురించి డాక్టర్ల ప్రకటలనుచూస్తే, ఎంత ఆందోళన పడాలో స్పష్టమవుతూంది. వృద్ధాప్యము, అందులోను కస్తూరిబా, మహాదేవదేశాయిలు పోవడంవల్ల కలిగిన ఆవేదన ఇందుకు కారణమన్నారు చాలామంది. ఏది ఎలాగున్నా వారు మనతో ఇంకా అనేక వత్సరాలుంటారనడానికి సందేహంలేదు. స్వాతంత్ర్యమహోద్యమానికి సారధ్యం వహించగల వారి శక్తి ఇంతలో సన్నగిలుతుందన్న భయానికి అవసరమే లేదు.

### రెండు ప్రశ్నలు

మహాత్మునితో సంభాషణలుగాని, వారి దగ్గర చర్చలుగాని, కూడదని డాక్టర్లు నిషేధించారు. కాని పర్ణకుటి అంతా రాజకీయ జోస్యాలకు, చర్చలకు, రంగస్థల మయిపోయింది. విలేఖరుల దండులు ప్యారీలాల్, మీరాబెన్ చుట్టూ మూసురుకునేవారు. ఏదో ఒక భోగట్టా వారి పెదవులనుంచి గుంజడానికి ప్రయత్నించేవారు. అలా, అలా చెవినిపడేమాటలు ముక్కలు — చాటుమాటున విన్నమాటలు—ఎలాగో సందుచేసుకొని జరిపిన అడావిడి సంభాషణలు — మా ఆలోచనలకు ఆస్కారాలివే. అంతా పరిశీలిస్తే, తేలినవి రెండు ప్రధాన ప్రశ్నలు—తలవని తలంపుగా ఈవిడుదల ఎందుకు జరిగింది? ఆపైని జరిగేదేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు తలకొకటి.

### సరోజిని సవాల్

ఇప్పట్లో వచ్చి మహాత్మునికి శ్రమ కలిగించ కూడదని రాజాజీ, బూలాభాయ్ దేశాయ్, మొదలయిన కొందరు ప్రముఖులు నిర్ణయించుకొన్నారు. కాని సరోజినీదేవి మహాత్ముని సాన్నిధ్యంలోవుంది, వారివిషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోదలచింది. ఉదయం ఆమె వస్తూందని విని స్టేషనుకి వెళ్ళాం—ఏమైనా చెబుతుందేమోననే ఆశతో. ఏదయినా ఒక ఆరోగ్యకారణాన్ని సాకుచెప్పి ప్రభుత్వం తనపైనున్న నిషేధాజ్ఞను రద్దుచేస్తుందా? అని అడిగాం. వెంటనే ఆమె సహజధోరణిలో జవాబు వచ్చింది— "మీరేం గాభరాపడకండి— ప్రభుత్వంనోటికే తాళం వేయబోతున్నాను." దీనిభావమేమిటో విలేఖరులకు ఒకంతట అనలేదు. కాని నేననుకున్నాను—ఇవి వట్టిహేళనకన్న మాటలేనా అని.

మహాత్ముడు విడుదలయ్యాడు— పాకిస్థాన్ ప్రభుత్వంనుంచి కానుకగా వస్తుందనే భ్రమ లీగుకు పూర్తిగా పోయింది. ఇక కాంగ్రెసు - లీగులు ఏకమై ప్రభుత్వం నోరు కట్టించగల బ్రహ్మాండమైన ఐక్యతను నిర్మించడానికి ఎంతైనా అవకాశం ఉంది.

పర్ణకుటిచేరగానే సరోజినీదేవి మహాత్ముని తన జాగ్రత్తలోకి తీసకొని వారితో ఎప్పుడూ మాట్లాడుతుండేది. తన విడుదలనాటినుంచి జరిగిందంతా వారికి రిపోర్టు ఇస్తూందా అనిపించింది. సరోజినీకి పటుత్వం తప్పిపోయింది; కాంగ్రెసు అధికారవర్గ అభిప్రాయాలకు ఆమె ఇక ప్రతినిధికాదు. అని బుకాయించే వారికి త్వరలోనే గింగురుమనిపించే చెంపపెట్టురాగలదని అనుకున్నాను.

### నిర్బంధంలో —

బొంబాయినుంచి వచ్చిన ఒకాయనతో మీరాబెన్ మాట్లాడుతూండడం చూచాను. వినబోతే, మనదేశంలో అధికాహారోత్పత్తికి చైనా వ్యవసాయ పద్ధతుల్ని అవలంబించడం గురించి మాట్లాడుతున్నారు. నాకదొక కొత్త విషయంగా తోచింది. అంతేకాదు: ఈ సారి నిర్బంధంలో నాయకులు గాఢమైన ఆలోచనలు జరిపినట్లు, బాగా చదివినట్లు వెల్లడయింది కూడాను.

### సోవియట్‌ను గురించి

నిజానికి మహాత్ముడు జాతీయ - అంతర్జాతీయ విషయాలనుగురించి తీక్షంగా ఆలోచించారట. ముఖ్యంగా సోవియట్‌ని గురించి ఎక్కువ శ్రద్ధతో చదివేవారట. సోవియట్ మూలసూత్రాలను బాగా అవగాహన చేసుకోడానికి మార్క్స్‌వ్రాసిన "కేపిటల్"ని, ఎమిలీబర్న్స్ వ్రాసిన "హేండ్ బుక్ ఆఫ్ మార్క్సిజమ్" మొదలైన పుస్తకాలను బాగా చదివారనీ ఆగాఖాన్ భవనంలో వారితోపాటు వుండిన ఒకరు చెప్పారు.

ఇదేం వింతకాదు. సోవియట్ రాజ్యం అజేయమని ఈ యుద్ధం రుజువు చేసింది. ఇలాంటప్పుడు అనిర్వాణాన్ని తెలుసుకోవాలనే శ్రద్ధ సహజమే. అంతేకాదు తన ప్రజల పట్ల శ్రద్ధకలిగి, వారిలో ఆరని స్వాతంత్ర్య జ్యోతిని రగిల్చిన ఒక మహావ్యక్తి సోవియట్ ఆదర్శాన్ని పరిశీలించడం వింతకాదు. పరపీడన, దారిద్ర్యాలనే కళంకం లేని స్వతంత్ర భారత దేశాన్ని ఆశయంగా నిలిపింది కాంగ్రెసు. ఈ ఆశయసాధనకు ప్రోత్సాహం ఉజ్వల సోవియట్ ఆదర్శం నుండిగాక మరెక్కడ నుండి రాగలదు!

ఇంతకుపూర్వం గురుదేవ్ ఠాగూర్ మహాకవిని ఉత్తేజపరచిందీ సోవియట్ ఆదర్శమే. భారతదాస్య విముక్తికి మార్గాలనన్వేషిస్తున్న మహాత్ముని నేడాకర్షిస్తున్నదా జ్యోతే. స్వాతంత్ర్య పోరాటంలో మహోజ్వల ఆదర్శాలను చూపారు సోవియట్ నాయకులు. మన జాతిలోని ఉత్తమోత్తములు నేడా నాయకులచే ఆకర్షింపబడుతున్నారు.

### "నయమవగానే—"

విడుదల సందర్భంలో మహాత్మునికి అభివందన సందేశం అందజేసిన మొట్టమొదటి రాజకీయసంస్థ భారత కమ్యూనిస్టుపార్టీ. బాట్లివాలా ఈ సందేశం తీసుకువచ్చాడు. అక్కడి వారికిది ఆశ్చర్యం కలిగించినట్లయింది. సందేశంవిని గాంధీజీ ఎంతో సంతసం వెలిబుచ్చాడు. "కాస్తనయంగా ఉండగానే, మీ అందరితోను సంభాషణలు సాగిస్తాన"ని బదులు చెప్పారు.

విడుదలయిన తరువాత చేతులు ముడుచుకూర్చోనని గాంధీజీ చెప్పినట్లు వారి అనుచర వర్గంలో ఒకరన్నారు. గత రెండు సంవత్సరాల విషాదఘటనలు దేశంలో వ్యాపింపజేసిన నిస్పృహనుచూచి ఎలాఊరుకోగలరు? వ్యవహారాల నన్నిటిని చక్కబెట్టి, ప్రజల్లో నూతనశక్తి నుద్దీపింపజేసి, విజయసాధనకు నడిపిస్తారనడానికి సందేహంలేదు.

### "ఆ ఉత్తరం సంగతేమిటి?"

పూనా స్టేషనులో మూడోక్లాసు బుక్కింగు హాలులో కొంతమంది భారతీయ సైనికులతో కలిసి నిల్చున్నాను. మహాత్ముడు విడుదలయినందుకు వారందరూ పట్టరాని సంతోషం కనపరచారు. తక్కిన నాయకులుకూడా విడుదలయ్యారా? అని వారిలో ఒకడుఆతృతతో అడిగాడు. "ఆ ఉత్తరం (గాంధీజీ జైలులో నుంచి జిన్నాకు రాసింది) గురించేమయినా చెప్పాడా?" అని ఒక ముస్లింసిపాయి అడిగాడు. ఇక కొద్దిరోజుల్లో దేశం అంతా ఇదే ప్రశ్న అడుగుతూంటుందని నేననుకున్నాను. అంతేగాదు. నాయకులమధ్య పట్టి ఉత్తర ప్రత్యుత్తరాలతోనే తృప్తిపడి ఊరుకోదని కూడా గ్రహించాను.

### మనసర్వసేనాని

పర్ణకుటి హాలులో కాంగ్రెసు అధ్యక్షుని దుస్తుల్లో సుభాస్‌బోసు పటం ఉంది. ఈ దేశద్రోహిని గురించి అక్కడి దేశభక్తులంతా ఏమనుకొంటున్నారా! అనుకొన్నాను.

ఇంతలోనే ఒక కాంగ్రెసాయన కొంతమంది స్త్రీలతోకలిసి వచ్చాడు — ఆపటం చూచాడు. "అదుగో—నేతాజీ అట! ఇప్పుడేమంటాడో ఇక?" అని తన అసహ్యతను వెలిబుచ్చాడు. ఈ బూటకపు సేనాధిపతి కింద నిజంగా ఒక సేన ఉందా అని అతను సందేహించాడు. "ఏది ఎలాగుంటేనేం. నిజమయిన మన సర్వసేనాధిపతి తిరిగి మనలోకి వచ్చాడు. ఇక నేతాజీలకు కాలంమూడింది" అని ఉప్పొంగాడు

తిరిగివచ్చేస్తున్నాం. అంతా చీకటి. కాని జాతి జీవనంలో చీకటి యిక అంతరించిపోతోంది. స్వాతంత్ర్య అరుణోదయం కానుంది. దేశద్రోహులు, ఫాసిస్టు తొత్తులకు కాళరాత్రి కమ్ముకొస్తూంది.

బుధవారం ప్రజాశక్తి 24-5-44

## కార్మిక సంఘాలపై అక్రమ దాడి

ప్రపంచ ప్రజలను బానిసలుగాజేసి, తమ నిరంకుశాధికారం స్థాపించాలని బయలు దేరిన ఫాసిస్టులను కార్మికోద్యమం ప్రపంచమంతటా యెదిరించి పోరాడుతోంది. ప్రజాస్వామిక హక్కులను రక్షించడానికి ముందు నిలబడి పోరాడుతోంది. కార్మికులు యుద్ధావసరాలను, ప్రజా అవసరాలను, తీర్చడానికి కష్టించి అధికోత్పత్తి చేయటం తమ ధర్మంగా యెంచుతున్నారు. ఈ పాలసీని అమలుజరపడానికి, కార్మిక జనసామాన్యంలో ఉత్సాహం కలిగించడానికి కార్మికసంఘాలు, కార్మికోద్యమం బలపడాలి. ఇందుకొరకే కమ్యూనిస్టులు, కార్మిక సేవకులు కృషిచేస్తున్నారు.

కాని, కార్మికోద్యమం బలపడటంచూచి మన రాష్ట్రంలో ఫ్యాక్టరీ యజమానులు యేమాత్రం సహించడంలేదు. అక్రమంగా కార్మిక సంఘాలపై దాడి వెడలుతున్నారు. కార్మికుల ప్రాథమికహక్కు అయిన సంఘ నిర్మాణాన్నే యెదిరించుతున్నారు. ఏవో సాకులుకల్పించి, యూనియన్ నిర్మాణంకొరకు కృషిచేసే కార్మికులను పనినుంచి తొలగించివేస్తున్నారు.

చిట్టివలస జ్యూట్ మిల్లు విషయంచూడండి. ఆ ఫ్యాక్టరీలో 3 వేలమంది కార్మికులు పనిచేస్తున్నారు. కమ్యూనిష్టుల నాయకత్వంక్రింద కార్మికసంఘం అధికోత్పత్తికి కృషిచేసింది. ఆగస్టు సంఘటనల సమయంలో ఉత్పత్తి కుంటుపడకుండా కాపాడగలిగింది. కాని కార్మికసంఘం బలపడటం ఆ యూరోపియన్ యజమానులకుగిట్టలేదు. వారి కల్పితరిపోర్టులపై ఆధారపడి ప్రభుత్వం సంఘాధ్యక్షుడైన కామ్రేడ్ భద్రంను 1943 మార్చిలో డిటెయిన్‌చేసింది. ఈవిధంగా రెచ్చగొట్టినా, కార్మికులు ప్రభుత్వ చర్యను ఖండించారేకాని, ఉత్పత్తిని కుంటుపరచలేదు.

కాని, యజమానులదాడి యింతటితో ఆగలేదు. కార్మికోద్యమంలో చీలికలు తేడానికి కృషిచేశారు. కార్మికులు అవిశ్వాసం ప్రకటించిన ఎం. ఏ. రెడ్డి యూనియనుకు మద్దతునిస్తున్నారు. అధిక సభ్యత్వం కలిగిన కాంగ్రెస్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు కామ్రేడ్ వెంకటేశ్వర్లును, మరిద్దరు కమ్యూనిస్టులను. గత ఏప్రియల్‌లో అరెస్టుచేసి ప్రభుత్వం డిటెన్యూలుగా నిర్బంధించింది. యూరోపియన్ యజమానుల ఆరోపణలపై ప్రభుత్వం ఈవిధంగా కార్మిక సేవకులను జైళ్ళకంపడం అక్రమం.

ఇంక ఏలూరు జ్యూట్ మిల్లు విషయంచూడండి. ఇచట యజమానులు కార్మికుల జీతంలో కొంతసొమ్ము అక్రమంగా హామీ పెట్టుకొని యూనియన్‌లో చేరవద్దని బెదరించారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరుకు రిపోర్టుచేయగా, హామీపెట్టుకోడం అక్రమమని డబ్బు యిప్పించివేశాడు. కార్మికులు సభజరిపి తమ యూనియన్‌ను స్థాపించుకొన్నారు. రిజిష్ట్రేషన్‌కొరకు పంపారు. వెంటనే మళ్లీ యజమానులు నిరంకుశంగా, రిజిస్ట్రేషన్ కాగితంపై సంతకంచేసిన 7గురు కార్మికులను, అక్రమంగా పనినుంచి తొలగించివేశారు అంటే మిల్లుమానేజరు కార్మికసంఘనిర్మాణాన్నే సహించడన్నమాట. తమసంఘాలను ఏర్పరుచుకోడం కార్మికుల ప్రాథమికహక్కు. ట్రేడ్ యూనియన్ శాసనం యీ హక్కును గుర్తించుతోంది. ఇలా శాసన విరుద్ధంగా చరించే మానేజరు పై ప్రభుత్వం చర్యతీసికొని, తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసికునేటట్లు చేయాలి.

గుంటూరు జ్యూట్‌మిల్లులోనూ, బందరు సైంటిఫిక్ కంపెనీలోనూ, యజమానులు నిరంకుశంగా కార్మికుల ప్రాథమిక హక్కులను సైతం గుర్తించక కార్మికులను రెచ్చగొట్టారు. దాని ఫలితంగా ఆకస్మిక సమ్మెలుకూడ వచ్చాయి. ఎంతో ఉత్పత్తి నష్టమయింది. ప్రభుత్వోద్యోగులు యజమానులు కోరినట్లు కార్మికులను బెదిరించడం, కేసులు బనాయించడమేగాని, కార్మికుల హక్కులను రక్షించ బూనుకోడం లేదు. కార్మికులను అణచడానికి యజమానులకు సాయపడుతున్నారు. ఇదే విధంగాసాగితే కార్మికులలో నిరుత్సాహం ప్రబలుతుంది. ఉత్పత్తే కుంటుపడుతుంది.

యుద్ధసమయంలో ఉత్పత్తిని యెక్కువ చేయాలసివుండగా, యీవిధంగా కార్మికోద్యమంపై దాడివెడలడం విషమపరిస్థితులకు దారితీస్తుంది. కాబట్టి మద్రాసు ప్రభుత్వం యజమానుల దాడిని గుడ్డిగా బలపరచే పాలసీని మానాలి. కార్మికుల న్యాయమైన హక్కులను కాపాడాలి. చిట్టివలస కార్మిక డిటెన్యూలను వెంటనే విడుదల చేయాలి. బందరు కార్మికనాయకులపై కేసులు ఉపసంహరించుకోవాలి. వివిధ ప్రదేశాలలో యూనియన్ కార్యకలాపాలలో పాల్గొన్నందుకు పనినుంచి తొలగించిన కార్మికులందరికీ తిరిగి ఉద్యోగాలిప్పించాలి. యజమానులు కార్మిక సంఘాలను గుర్తించునట్లుచేయాలి. ఉత్పత్తిని హెచ్చుచేయడానికి కార్మికుల, యజమానుల ప్రతినిధులు, కలసిన కమిటీలను నియమించాలి.

## ప్రజలకు ఉపయోగకరమైన పనిని ప్రజాసంస్థలే నెరవేర్చాలి

### కృష్ణకాలువ మరమ్మతు దృశ్యాలు

— మా విలేఖరి

ఆంధ్ర రైతాంగ చరిత్రలో — కాదుకాదు, భారత రైతులోకంలోనే ఒక చరిత్రాత్మక ఘటన బెజవాడలో జరుగుతూంది. 5 లక్షల 80 వేల యకరాలకు నీటియెద్దడిని తొలగించి, మరో 40 వెల యకరాలను వల్లవుసాగులోకి తేగల కార్యక్రమం కృష్ణకాలువల మరమ్మతు స్కీము. అధికాహారోత్పత్తికి అవకాశం కలిగించి, కరువుకాటకాల నరికట్టి, ప్రజలను కాపాడగల కార్యక్రమమది. ప్రజోపయోగకరమైన ఇలాంటి స్కీములను తప్పకకొనసాగింపజేయడం ప్రజాసంస్థల కర్తవ్యం.అదువల్లనే, ఈ కార్యభారాన్ని ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం తన భుజాన వేసుకొంది. దీనిని నిర్వహించడం ఏమంత సులభమయిన పనికాదు. ఇవి ఆకుమళ్ళరోజులు. రైతులకు, కూలీలకు చేతినిండా పని వున్నరోజులు. ఇతరప్రాంతాలకు, ఇతరపనులకు, కూలీలు రావడం సాధ్యంకాదు. ఇట్టి పరిస్థితులలో ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఒక ప్రజాసంస్థ నిర్వహించ పూనుకోవడం భారతదేశంలో ఇదే మొదటిసారేమో! భారతదేశంలో ఇంతవరకు కనివిని ఎరుగని బ్రహ్మాండమైన రైతుమహాసభను జరుపగలభాగ్యానికి మొన్న మొన్ననే ఆంధ్రదేశం నోచుకొంది. ప్రజాసేవకుల చొరవవల్ల తిరిగి నేడీ అపూర్వ కార్యనిర్వహణకు పూనుకొని ధన్యురాలయింది. భారత నిర్మాణోద్యమ చరిత్రలో గౌరవస్థానం సంపాదించుకొంది.

★

పని ఎలా జరుగుతూందో చూడ్డానికని బయలుదేరి, కాలవను సమీపిస్తున్నాను. గాలిలో తేలి వస్తూందొకపాట:

తవ్వాలి తవ్వాలి కూలన్న
కాలువలు తవ్వాలి కూలన్న
మనరైతుసంఘమే కూలన్న
మనరాష్ట్రసంఘమే కూలన్న
ఎలుగెత్తి కేకేసె కూలన్న
జాగేల మనకింక కూలన్న

• • •

పూబుపాలెం వ్యవసాయకూలీ, దోనేపూడి సుదర్శనం ఉత్సాహంతో యిలా పాడేస్తూ పనిచేస్తున్నాడు. పాటను రాసిందికూడ అతనే. తన తోడిపనివారు పాటనందుకొని ఉత్తేజితులవుతున్నారు.

కాయకష్టంతోనే కాలంగడిపే యువకుడు సుదర్శనం. ప్రజల క్షేమంకోసం తనసంఘం తలపెట్టిన కార్యక్రమం అతని నుత్తేజపరచింది. అతనిలో కవిత్వాన్నికూడా రేకెత్తించింది. ఇంకా పాడుతున్నాడు సుదర్శనం.

కాలువలు తవ్వాలి కూలన్న
కరువులు తీర్చాలి కూలన్న
మన దేశగుమ్మాన కూలన్న
మాయఫాసిస్టులు కూలన్న
మరికాలుబెట్టారు కూలన్న
మనమంతకలవాలి కూలన్న
జేజేలుకొట్టాలి కూలన్న

నిజం. సుదర్శనమూ, అతనిలా ప్రజాక్షేమాన్ని కోరే రైతు, కూలీలందరూ ఈ కార్యక్రమంయొక్క విలువను గుర్తించారు. తమ రైతు - కూలీ సంఘాలకు చేయూతగా నిల్చి కార్యక్రమాన్ని జయప్రదంచేయ దీక్ష వహించారు. పని జరుగుతూన్నంతమేరకు కాలవలో తిరిగాను. ఇంచుమించు అంతటా వాతావరణం ఈ ఉత్సాహం, ఈ దీక్షతోనే నిండిఉంది.

### అధికతర కార్యభారం

పని సకాలంలో పూర్తికావాలంటే,రోజుకు మూడువేలనుంది పనిచేస్తుండాలని రైతుసంఘం పిలుపిచ్చింది. 19 వ తేదీనాటికి సుమారు 2300 మంది మాత్రమే కూలీలు వచ్చారు. వీరిలో 7, 8 వందలమంది వ్యవసాయకూలీలు. మిగతావారు ఉప్పర్లు. కమ్యూనిస్టుపార్టీ తనవంతు సాయంచేసింది. రైతు, కూలీరంగాల్లో పనిచేస్తున్న ఇతర కామ్రేడ్సు, వేయిమందివచ్చి కాలవపని చేయాలని సందేశం ఇచ్చింది. 19 వ తేదీనాటికి 700 మంది కమ్యూనిస్టులువచ్చి పనిలో నిమగ్నులయారు.

వీరికి, వ్యవసాయకూలీల్లో కొంతమందికి ఇది అలవాటులేనిపని. తమ శక్తినంతటినీ పరీక్షిస్తుందా అనిపించేపని. పని పూర్తి అయిన తరువాత వీరు ఒళ్ళు పట్టుకుంటూ కూర్చొనేవారు (మొదటిరోజుల్లో) ఆపక్కనే ఇతర ముఠాలు చెడుగుడు లాడేవి. వీరికి వారికి గల తేడాకిది నిదర్శనం. అయినా పట్టుదలతో పనిచేసితక్కినపనివాళ్ళక్కూడా ఆదర్శప్రాయులు కాదలిచారు.

### ఎర్రజెండాలు ప్రోత్సహిస్తుంటే-

అంతా పర్యాలోకిస్తూ, ఉత్సాహంతో ముందుకు నడిచాను. అక్కడక్కడ కాలవలో ఎర్రజెండాలు నాటబడున్నాయి. పార్టీసభ్యుల, రైతుకూలీవర్కర్ల, ముఠాలు ఒక్కొక్క జండాను పాతుకొని, దాని సాన్నిధ్యంలో పని సాగిస్తున్నారు. ఇతరకూలీ ముఠాల నుంచి వీరిని ప్రత్యేకించే చిహ్నం మాత్రమేనా ఆజండా అని ఆలోచించాను. ఆలోచించగా, అంతకన్నా గొప్ప విలువవుందని గ్రహించాను. వడ్డివుప్పర్లు, మొదలైన ఇతర కూలీ ముఠాలకు-ఈ ముఠాలకు ఎంతో తేడా ఉంది. ఆముఠాలకు ఇలాంటిపని ఉగ్గుపాలతో నేర్చిన విద్యలాగుంది. ఈ ముఠాలకో - ఇవి కండల్ని కరగదీసే పని. అడుగడుగునా ఉత్సాహాన్ని, కార్యదీక్షను ఉద్దీపింపజేసే ఆశయజ్యోతి వారిఎదుట ఉండడం అవసరమనిపించింది. వారి సమక్షంలో రెపరెపలాడుతూన్న ఆ ఎర్రజెండాల విలువ అదేనని గ్రహించాను. ఎర్రజెండాను చేతబట్టి తమ పార్టీ, తమ సంఘాలు పిలుపునిచ్చాయి. ఆపిలుపు విని వచ్చారు వీరు. కష్టమని కూర్చుంటే తమ జండా ప్రతిష్ఠకు భంగం. ఆ జండాకింద సాగు (మిగతా 11 వ పేజీలో)



★ చిన్న కథ

## పాలేరు తమ్ముడు

"బాలసంఘ సభ్యులం -
భరతమాత పుత్రులం
కులము మతము ఏదియైన -
కలసిమెలసి యుండెదం"

ఈ పాట బుల్లెయ్య చెవులో గింగురుమన్నది. ఎంతో ఉత్సాహం కలిగించింది. అమ్మ దగ్గరికి పరుగెత్తాడు.

"అమ్మా అమ్మా, నేనూపోయి వాళ్ళతో ఆడుకుంటానే" అని అడిగాడు.

"వద్దునాయనా, కుర్రాళ్ళంతా కలిసిన కాడ్నుంచి కీచులాడుతారు."

"లేదమ్మా, వాళ్ళంతా చక్కగా ఆడుకోటంలేదూ? .... నేనూ యెల్తానే." అని తల్లిదగ్గర మారాం చేయసాగాడు.

తల్లికి తప్పిందికాదు. ముఖం కడిగి, తెల్ల గుడ్డలువేసింది బుల్లెయ్యకు. పాలేరుకుర్రాడు వెంకడ్ని పిలిచి - "ఒరేయ్, యెంకా, చిన్నబాబు ఆడుకోనుపోతున్నాడు — వెంటవెళ్ళు" అన్నది.

పాలేరు వెంకడు తల ఊపాడు.

"అలా మూగ దయ్యంలాగ నించుంటావేమిరా? నోరు పడిపోయిందా? - జాగ్రత్తగా చిన్నబాబును తీసుకెళ్ళు. ఎవరన్నా కొట్టారంటే నీ వీపు పగిలిందే .... తీసుకుపో."

పాలేరు వెంకడు జవాబివ్వలేదు. పని చెప్పినప్పుడల్లా యీ ఊతపదాలు వింటుంటాడు. వాడి కివన్నీ అలవాటైపోయినాయి. బుల్లెయ్యవెంట వెళ్ళాడు, కాపలాగా.

పిల్లలంతా ఆడుకుంటున్నారు. "ఎంకిగా, నువ్విక్కడే కూర్చో"— అని పాలేరునక్కడే కూర్చోమనిచెప్పి బుల్లెయ్య ఆటలో కలిసిపోయాడు.

పాలేరు వెంకడు అక్కడే కూర్చున్నాడు. ఆటకేసి పరీక్షగా చూస్తున్నాడు. .... పాపం, ఎనిమిదేళ్ళ వయస్సుకే వెంకడు యెంత పెద్దవాడైపోయాడు! ఈ ఆటలాడుకునే అదృష్టం వాడికిలేదు. పొట్టకి జరగక తండ్రి వాడిని పాలేరునిజేసి, నెత్తిమీద యెంతో బాధ్యత వేశాడు. పాలేరుతనంచేస్తున్న దొరగారింట్లో పెద్దపని, చిన్నపని అనేది లేకుండా, చెప్పినవన్నీ చేయాలి. ఆడుకోను అవకాశమేలేదు. చదువుకోటంమాట అటుంచి.

వెంకడి కండ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఎంత అణుచుకోవాలన్నా, వాడిలోని పసితనం బయటికి తలచూపింది. తనకే తెలియకుండానే పిల్లలు ఆడుకుంటున్న వైపు కాళ్లు తీసుకుపోయినాయి.

"ఒరేయ్, యెంకిగా, నువ్విక్కడి కెందుకురా?" అని బుల్లెయ్య కసరుకున్నాడు. పాలేరు వెంకడు అక్కడే ఆగిపోయాడు.

"అదేంటోయ్ బుల్లెయ్యా: తప్పుకాద్రూ? వాడుమాత్రం మనలాంటివాడు కాదూ? .... అందరంకలసి ఆడుకుంటే బాగుంటది," అని బాలసంఘ సభ్యులందరూ మందలించారు, బుల్లెయ్యను.

పాలేరు ముఖం కళకళలాడింది. ఆటలో కలిశాడు. కాని వాడితోకలిసి ఆడుకుంటుంటే, బుల్లెయ్యకు వొళ్ళు జలపొడిచింది. వాడిని తాకినప్పుడు గొంగళిపురుగును తాకినట్లయ్యేది. ఎప్పుడూ అలవాటు లేదాయె.

మూడు రోజులవరకూ పాలేరు వెంకడితో ఆడుకోటం కొత్త అనిపించింది. తర్వాత తర్వాత అలవాటైపోయింది. పిల్లలంతా పాలేరుని 'వెంకయ్యా' అని పిలవటంచూచి తాను 'వెంకిగా' అని పిలవటం మానేశాడు. ఇప్పుడు వెంకయ్యతో యింటికాడగూడా, చిన్న తమ్ముడితో ఆడుకున్నట్లు ఆడుకుంటున్నాడు.

బుల్లెయ్య అమ్మకిది యేమాత్రమూ కిట్టలేదు.

"తప్పుకాదురా — వెంకడ్ని ముట్టుకుంటావు?" అన్నది.

"యేంతప్పమ్మా? వాడుమాత్రం నాలాంటోడుకాదూ?"

"వాడ్ని ముట్టుకుంటే మీనాన్న కోప్పడతారు, తెలుసా? అదీగాక, మన్లాంటివాళ్ళ అలికివాళ్ళతో ఆడుకోవచ్చా?" అని తప్పించుకోడానికి సాకు బుల్లెయ్య తండ్రిమీదవేసింది.

నిజానికి యిక్కడామె పెద్ద అబద్ధమాడింది. మొన్న బుల్లెయ్యనాన్న పట్నం వెళుతున్నప్పుడు ఊరుదాటగానే, తన గుడ్డల సంచి పాలేరు వీరయ్యనే పట్టుకోమని యివ్వడం బుల్లెయ్య స్వయంగా చూచాడు. తండ్రికి కులం అంటే పట్టింపులేదు. కాని పాలేరుతో ఆడుకోటం అంటే కొద్దిగా సంశయిస్తాడేమో.

బుల్లెయ్య అమ్మమాట వినకుండా వెంకయ్యతో ఆడుకుంటున్నాడు.

"ఒరే, బుల్లిబాబూ, నీకు అసహ్యం లేదట్రా? చింకిగుడ్డల్తో కంపుగావుండే వాడితో ఆడుకుంటావు. సిగ్గు లేదూ?" అన్నది తల్లి.

"వాడికి గుడ్డలులేంది యేంచేస్తాడమ్మా? నా చొక్కాలాగూ వాడికొకటివ్వరాదూ? వాడే చక్కగా వుంటాడు," అన్నాడు బుల్లెయ్య.

తల్లి బుల్లెయ్యకిక చెప్పి లాభంలేదనుకున్నది. కొత్తపన్నాగం వేసింది.

"ఒరే యెంకిగా; గాడిదకొడకా పోయి పేడతీసుకురా" అని పాలేరుని కసిరి పంపించేసి, వాళ్ళిద్దర్ని విడదీసింది.

వెంకయ్యతో ఆడుకోనివ్వనందుకు బుల్లెయ్య అలిగి పడుకున్నాడు. ఆపూటంతా లేవలేదు. సాయంత్రం తల్లి చీకాకు పడుతూ "వెధవ, పట్టిన పట్టు విడువడు," అంటూ ఒక చొక్కాలాగూ తీసి పాలేరు వెంకయ్య మీద విసిరి — "పోరా బుల్లెయ్యా: ఇంకా మూతి ముడుచుకు పడుకుంటావే?" అన్నది.

బుల్లెయ్యా, పాలేరు వెంకయ్యా,శుభ్రమైన గుడ్డలు తొడుక్కొని బాలసంఘంవైపు బయలుదేరారు. కొంచెం దూరం ఉండగానే వినబడుతున్న పాట వాళ్ళిద్దరి ముఖాలను వికసింపజేసింది.

"బాలసంఘ సభ్యులం - భరతమాత
పుత్రులం
కులము మతము ఏదియైన - కలసి
మెలసి యుండెదం"

అన్నపాట గాలిలో ప్రతిధ్వనిస్తున్నది.

★

## బాలబాలికలకు

"ఇదిగో ఈ డబ్బు, ఈ చీటీ 'దొడ్డమ్మ'గారికి ఇవ్వండి" అంటూ ఒక అమ్మాయి "ప్రజాశక్తి" ఆఫీసుకు వచ్చింది. ఆ చీటీ, ఆ డబ్బు నాకు చేరాయి. ఆ చీటీలో ఏముందో తెలుసా? చూడండి:

అయ్యవారి రుద్రవరం 7—5—44

"నాకు పదిసంవత్సరాలుదాటి పదకొండో సంవత్సరం వచ్చింది ప్రతియేటా నా పుట్టిన పండగరోజున పిల్లలందరికి పప్పుబెల్లాలు పంచిపెట్టడం అలవాటు. కాని ఈ సంవత్సరం అలా ఖర్చుపెట్టడానికి నా మనస్సొప్పలేదు. బెంగాలులో నాబోటి పిల్లలెంతమందో కరువుతో బాధపడుతున్నారు. అందుకని, ఈ డబ్బు వాళ్ళకు పంపటానికి నిశ్చయించుకొన్నాను. మా అమ్మావాళ్ళతో అలాగే చెప్పాను. వాళ్లుకూడా ఒప్పుకొన్నారు. నేనిచ్చే యీ రెండురూపాయలను మీరు బెంగాలుకు పంపండి. ఇక ముందుకూడా మా అమ్మ నాన్నావాళ్లు ఇచ్చే డబ్బుల్ని బెంగాలుకు పంపడానికి ప్రయత్నిస్తాను.

ఇట్లు,
టి. లీల"

చూశారా, ఈ అమ్మాయి దేశభక్తి! ఇంతేగాదు. ఒక పెండ్లి సందర్భంలో బెంగాలు కరువుపాటపాడి, మరి రెండురూపాయలు విరాళం వసూలు చేసింది కూడా. లీల ఆదర్శాన్ని మీరంతా జ్ఞాపకం ఉంచుకోండి.

పుట్టిన పండగ సందర్భంలో లీలకు నా ఆశీస్సులు.

ఇలాగే బెంగాల్ నిధికి మీ మీ బాలసంఘాలు చేస్తున్న కృషిని గూర్చి రిపోర్టులు పంపిస్తూవుండండి.

ఇటీవల గుంటూరుజిల్లాలో ఫణిదం బాలసంఘం విచిత్రవేషాలద్వారా బెంగాలు నిధి ప్రోగుచేయడానికి నిశ్చయించింది. "అబ్బో! ఇలా చాలామంది నిశ్చయించుకున్నారులే" అని మీరనుకొంటారేమో - అలాకాదు. ఫణిదం బాలసంఘానికి పాటలుపాడటంలో మంచి నేర్పువుంది. రైతుమహాసభకు అనేక గ్రామాలలో వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిపి, రు. 150-0-0 వసూలుచేశారు. ఇంకా 5 రూపాయలు మహిళాసంఘానికి వసూలుచేసి ఇచ్చారు. కాబట్టి వాళ్ళు అనుకున్నరీతిగా బెంగాలుకు తప్పక సహాయం చేస్తారు.

పాటలు బాగా పాడతాం కదా అని వాళ్ళకు గర్వం ఉందనుకుంటారేమో. అదేమీలేదు. తప్పుచేస్తే వెంటనే సరిదిద్దుకొంటారు. 19-4-44 న ఫణిదంలో జరిగిన బాలసంఘ సమావేశంలో ఇద్దరు బాలురు తమ తప్పులను ఒప్పుకొన్నారు. ఒకబ్బాయి, తాను నిమ్మకాయల దొంగతనం చేశాననీ, ఇక చెయ్యననీ ఒట్టుపెట్టుకొన్నాడు. మరొక పిల్లవాడు తాను అనవసరంగా మూడు పొన్నంగిపిట్టల్ని చంపాననీ, ఇకమీద చంపనని, చెప్పాడు; క్షమించమని కోరాడు.

మీరుకూడా, తప్పులు చేయకండా ఉండటానికి ప్రయత్నించండి. చేస్తే, వెంటనే సరిదిద్దుకోడానికి ప్రయత్నించండి.

— దొడ్డమ్మ.

## సోవియట్ ఫిల్ము ప్రదర్శనాలు

బెంగాల్, రాయలసీమ, చికాకోలు కరువు బాధితుల సహాయార్థం ఆంధ్రలో ప్రదర్శించబడుతున్న సోవియట్ ఫిల్ములు అన్నివర్గాల వారిని ఆకర్షించినయి. ఇంతవరకు 9 పట్టణాల్లో చూపబడినయి. మొత్తం 15000 మంది ప్రజలు ఫిల్ములనుచూచారు. వసూలైనమొత్తం సుమారు రు 6500—0—0. వసూలైన ధనాన్ని స్థానికంగా యేర్పడిన కమిటీలే సరాసరి కరువుబాధితుల సహాయార్థం ఏర్పాటు చేయబడిన రిలీఫ్ కమిటీలకు పంపుతున్నాయి.

సోవియట్ ప్రజల జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించే ఈ ఫిల్ములను విద్యార్థులు, కార్మికులు, రైతులు, వ్యవసాయకూలీలు—అందరూ అభినందించారు. ఇలాంటి ఫిల్ములు ఇంకా కావాలని ప్రతిచోటకోరారు.

విశాఖ, విజయనగరాల్లో ఎక్కువగా హాజరైంది కార్మికవర్గం. సినిమాహాలు ప్రొప్రయిటర్లు మరికొన్ని ప్రదర్శనాలకు అవకాశం ఇచ్చిఉంటేబాగుండేదని చాలామంది అభిప్రాయపడ్డారు. ఆరెండుపట్టణాల్లో ప్రదర్శించిన 2 ఆటలకు మొత్తం వసూలైంది రు 761—0—0.

పిచ్చిపిచ్చి కథలతో ఎన్నిఫిల్ములు తీస్తేనేం? ఇలాంటి ఉపయోగకరమైన ఫిల్ములు కొద్దిగా తయారైనా, ప్రజల కెంతో మేలు చేస్తయి. అని అనేక పట్టణాల్లో ప్రేక్షకులు అభిప్రాయపడ్డారు.

★

## విడుదల

కామ్రేడ్ ముళ్ళపూడి వీరభద్రం 'కాంగ్రెసు లేబరుయూనియన్' (చిట్టివలస) అధ్యక్షుడుగా ఉండి, అక్కడి జూట్‌మిల్లు కార్మికులను సంఘటితపరుస్తూ వచ్చాడు. 1943 మార్చిలో ప్రభుత్వం ఇతన్ని డిటెన్షన్‌లో పెట్టింది. డిటెన్యూల కేసులను తిరిగి పరిశీలించాలనే రూలు ప్రకారం వీరి విషయాన్ని ప్రభుత్వం విచారణచేసి, 12-5-44 న వీరిని విడుదల చేసింది.

# బర్మాను పరిపాలించేది ఎవరు?

## బర్మాప్రజలా? జపాన్ అధికారులా?

బర్మా బ్రిటిష్ పరిపాలకుల చేతుల్లో ఉన్నప్పుడు పరిశ్రమలను నడిపే పెట్టుబడిదారులుగాని, వ్యాపారస్తులుగాని, లేదు, ఎగుమతి - దిగుమతులు సహితం విదేశీయుల (భారతీయులు - చైనావారు) చేతుల్లో ఉండేవి. మొత్తం భూమిలో సగానికి పైగా చెట్టియార్లది (దక్షిణఇండియాలోని వ్యాపారస్తులు). చిన్నవర్తకులు, బియ్యం మిల్లుల యజమాన్లు, రంపం మిల్లు యజమాన్లు, చేతిపరిశ్రమల యజమాన్లు, విద్యాధికులు, లాయర్లు, డాక్టర్లు, మొదలైనవారు మాత్రమే బర్మన్లు. వీరిని "మధ్యతరగతికి చెందిన ఉన్నతవర్గం" అని పిలువవచ్చు. వీరి నాయకత్వం క్రిందనే బర్మాలో జాతీయోద్యమం వృద్ధిచెందింది. అది బర్మన్ రైతాంగం యొక్క, మధ్యతరగతి ప్రజాసామాన్యం యొక్క, జాతీయవాంఛలకు ప్రతిబింబం.

### "బర్మా బర్మన్ ప్రజలకే ఉండాలి!"

ఉన్నతవర్గానికి చెందిన యీ బర్మన్లు ఆర్థికంగా అభివృద్ధిచెందే దశలో, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, భారతీయ పెట్టుబడిదారులు (వ్యాపారస్తులు), వీరి అభివృద్ధికి అడ్డువచ్చారు. జపాన్ సేనలు బర్మాలో ప్రవేశించి నప్పుడు, "బర్మా బర్మన్లకే ఉండాలి!" అనే నినాదంద్వారా జపాన్ అధికార్లు యీ ఉన్నత వర్గాన్ని ఆకర్షించారు. వీరి సహాయంతోనే తమ పరిపాలనను కొనసాగించుకొన జూచారు. ఉన్నత వర్గపు బర్మన్లు ఈ వలలో చక్కగా పడ్డారు. పారిశ్రామికంగాను, యితర విధాలుగాను, బర్మాను అభివృద్ధిచేయడంలో జపానువారు తమకు కూడా కొంతభాగం యిచ్చితీరుతారని వీరు విశ్వసించారు. "వ్యాపారంలోను, పరిశ్రమల లోను, బర్మాప్రజలకు మంచిస్థానం లభించుతుం"దని వీరు తీయని కలలెన్నో గన్నారు. తమ అభివృద్ధికి, బర్మా ప్రజల జాతీయ వాంఛలకు, జపాను ప్రభుత్వం అండగా నిలబడి, మార్గం చూపుతుందని ఆశించారు. "బర్మా బర్మన్లకే ఉండాలి," అనే నినాదం వీరిని మత్తుమందు చల్లినట్లు చేసింది. తామే యీ నినాదాన్ని ప్రజల్లో ప్రచారంచేశారు. బర్మా అంతటా అది ప్రతిధ్వనించింది. రైతులు, యితర ప్రజాసామాన్యం, తాము స్వర్గానికి బెత్తెడు దూరంలో ఉన్నట్లు భావించారు. బర్మా అంతా తమ చేతుల్లోకే వచ్చినట్లు ఉబ్బిపోయారు.

### ఒక యజమానిపోయి, మరొక యజమాని!

కాని, జరిగింది యేమిటి?

బర్మాలో జపాన్ ప్రభుత్వం యేర్పడగానే రైల్వేలు-ఓడమార్గాలు - పెట్రోలుబావులు - కలపవు పరిశ్రమ, గనులు, అన్నీ కొత్తప్రభుత్వానికి ట్రాన్సుఫర్ ఆయాయి. అంటే, ఏ సంపదను బర్మన్లు మొదటినుంచీ తమదిగా భావిస్తూవచ్చారో, అది ఒక ప్రభుత్వమునుంచి మరొక ప్రభుత్వానికి చేతులుమారింది. ఈ యదార్థాన్ని క్రమంగా ప్రజలు గ్రహించనారంభించారు.

కాని, పై తరగతికి చెందిన బర్మన్లు మాత్రం ఆశలు వదులుకోలేదు. జపాన్ ప్రభుత్వానికి సహాయంచేస్తే, ఎప్పటికైనా తమ్ము పైకితీసుకొస్తారని వీరు ఆశిస్తూవచ్చారు.

"సదర్న్ రీజయన్స్ డెవలప్‌మెంట్ బ్యాంక్" (ఎస్. ఆర్. డి. బ్యాంక్) అనే పేరుతో జపాన్ అధికారులొక బ్యాంకింగ్ సంస్థను బర్మాలో స్థాపించారు. దానికి మూలధనం జపాన్ ప్రభుత్వపు బ్యాంకులనుండి తీసుకొచ్చారు. ఈ ఎస్. ఆర్. డి. బ్యాంకు, బర్మాలోఉన్న జపాన్ పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు, పెట్టుబడి పెట్టింది. బర్మా ప్రజలకు ఒక్క షేర్‌కూడా లేదు. అంటే ఎస్.ఆర్.డి. బ్యాంకుద్వారా జపాన్ సామ్రాజ్యవాదులు బర్మా ఐశ్వర్యాన్ని కాజేస్తున్నా రన్నమాట.

### గుత్తవ్యాపారం

ఎస్.ఆర్.డి. బ్యాంక్‌కు అనుబంధంగా అనేక వ్యాపారసంస్థలు బయల్దేరాయి. గుత్తవ్యాపారం ద్వారా అవి బర్మాయొక్క ఆర్థిక వ్యవస్థను తమ గుప్పెట్లో ఉంచుకున్నాయి. తద్వారా అనేకలక్షల యెన్ను (జపాన్ నాణెము)లు లాభం సంపాదించాయి. ఉదాహరణకు, 1944-45 సంవత్సరపు జపాన్ బడ్జెట్‌లో, ఎస్. ఆర్. డి. బ్యాంకు జపాన్ ప్రభుత్వానికి 700 కోట్ల యెన్నులు అప్పు యిచ్చినట్లు లెక్క చూపబడింది. జపాన్ ప్రభుత్వం 10 కోట్లయెన్నులకంటే ఎక్కువ మూలధనం ఆబ్యాంకులో ఎన్నడూ పెట్టియుండలేదు! దీని అర్థం ఏమిటి? బర్మా ప్రజల కష్టార్జితమంతా యీ ఎస్. ఆర్. డి. బ్యాంకు ఇనుపపెట్టెలలో కరుడు కట్టిందన్నమాట.

జపాన్ ప్రభుత్వం వచ్చాక, బర్మన్లకు విరివిగా వృత్తివిద్యలు నేర్పుతామనీ; యంత్రాలు తెప్పించి యిస్తామనీ; అనేక దేశీయ పరిశ్రమలకు ధనసహాయం చేసి ప్రోత్సహిస్తామనీ-ప్రచారం చేశారు. కాని, త్వరలోనే ఈ ఆశలు అడియాసలయాయి. తమ ఓడలలో రకరకాలయంత్రాలొస్తాయని చెప్పిన అధికారబృందం, యంత్రాలకు బదులు మనుష్యుల్ని తీసుకొచ్చారు. వీరంతా చిన్నచిన్న పరిశ్రమదారులు, వ్యాపారస్తులు, నిరుద్యోగులై రోడ్లమీద తిరిగేవిద్యాధికులు. గత 12 సంవత్సరాలుగా జపాను యుద్ధజ్వాలలో దగ్ధమవుతూండడంవల్ల, వీరిలో అసంతృప్తి ఎక్కువై విప్లవకారుల వలకుబడిక్రిందికి వస్తున్నారు. దీన్ని అరికట్టడానికి, వీరిని యిలా బర్మాకు పంపివేస్తున్నారు.

### ఎందుకు వాగ్దానాలు భగ్నమయాయి?

ఇంతేకాదు, చైనా, మంచూరియా, మలయా, బర్మా, మొదలైనచోట్ల అనేకమంది జపాన్ సైనికులున్నారు. వారందరికీ కావలసిన వస్తుసామగ్రి ఒక్క జపాన్‌లోనే తయారుచేయడం సాధ్యంకాదు. ఇకకొత్తగా లభించిన దేశాలలో వెంటవెంటనే పరిశ్రమలనుస్థాపించడం, అక్కడి సహజసంపదనుఅభివృద్ధిచేయడం, తన సైనికులకు కావలసిన సాధన సంపత్తినంతనూ దేశీయ పరిశ్రమల ద్వారా సప్లయిచేయడం-కూడా సాధ్యంకాదు. ఎందువల్లనంటే, సుమారు 50 సంవత్సరాల కాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు చేయలేని పనిని జపాన్ యెలా చేయగల్గుతుంది? కాబట్టి, బర్మాలో ఉన్న జపాను సేనలకు తిండి, బట్ట ఎక్కడికక్కడ, స్థానికంగా, దొరికే యేర్పాట్లు చేసుకోవలసి వచ్చింది.

అఖరువిషయమేమంటే, ఉన్నత వర్గానికి చెందిన బర్మాప్రజల్ని సంతృప్తి పరచడానికి భారతీయుల స్వాధీనంలోఉన్న వ్యాపార సంస్థలన్నింటినీ లాక్కొని, వారి కీయాలి. కాని, అలా చేస్తే, యిటు భారతదేశంలో అసంతృప్తి వ్యాపిస్తుంది; తమ తీయని కబుర్లన్నీ మాయమాటలని మన దేశంలోకూడా తెలిసిపోతుంది. అందువల్ల, జపాన్‌పాలకులు ఉన్నత వర్గానికి చెందిన బర్మా ప్రజల్ని సంతృప్తి పరచలేక పోయారు.

మాంగ్ ఫీన్ పే

జపాన్ ప్రభుత్వం తరపున నోట్లను అచ్చువేసేది ఎస్. ఆర్. డి. బ్యాంకు, అంతేగాకుండా, చిన్నచిన్న సైనికదళాలు ఎక్కడికక్కడ, స్వతంత్రంగా, నోట్లను అచ్చువేసుకోవచ్చు. ఈ విధంగా, కాగితంనోట్లు సరకుల ఉత్పత్తితో ఎట్టి సంబంధం లేకుండా, విరివిగా, అచ్చువేయ బడుతున్నాయి. ఏమీ విలువలేని ఈనోట్లతో దేశంలోవున్న సరకును కొనేస్తున్నారు. దీనివల్ల వర్తకులు, రైతులు మొదలయిన వారందరూ దుర్భర దారిద్ర్యానికి బలి అవుతున్నారు.

పెద్దపెద్ద జపాన్ వ్యాపారసంస్థలు తమ వద్ద కొల్లలు కొల్లలుగా వున్న కాగితం నోట్లతో ప్రత్తి, ఆహారధాన్యాలు, కొని, సైనికులకు సప్లయిచేయసాగాయి. ఎక్కడికక్కడ కార్ఖానాలు తెరచి, స్త్రీలచే నూలు తీయడం, బట్టలు నేయడం వగైరా పనులు చేయిస్తున్నారు. యుద్ధానికిపూర్వం బర్మాకు జపాన్ బట్ట ఎక్కువగా దిగుమతి అయేది. ఇప్పుడు ఆ దిగుమతులు ఆగిపోవడమేకాకుండా, స్థానికంగా దొరికే ప్రత్తితో సైనికులకు దుస్తులు నేయించవలసివస్తోంది. అందువల్ల, ప్రజలకు బట్టలకరువు యేర్పడింది. చాలామంది గోనెసంచులు, చిరిగిపోయిన దోమతెరలు, కట్టుకొని తిరుగుతున్నారు. సిల్కుబట్టలకుప్రసిద్ధికెక్కిన దేశంలో గోనెసంచులు కట్టుకోవలసిన గతి పట్టింది!

### దోపిడీనిధానం

జపాన్ పారిశ్రామిక నిపుణులు వంటకు ఉపయోగించే నూనెతో ఇంజన్లు నడుపుతున్నారు. అందువల్ల ప్రజలకు నూనె తగినంతగా సప్లయి చేయబడ్డంలేదు. ఇంతేకాదు. అనేక జిల్లాలలో బియ్యానికి సహితం కరువు ఏర్పడింది. ఎందువల్లనంటే, వ్యవసాయానికవసరమైన చాలా పశువుల్ని సైనికులు లాక్కుపోయారు. వ్యవసాయకూలీలను మిలిటరీపనులకు తీసుకుపోయారు. రాకపోక మార్గాలుకూడా, సైనిక రవాణావల్ల, దారుమారయాయి. రైతులు కాగితంనోట్లవల్ల ఉపయోగం వుండదని తెలుసుకొని, జపాన్ అధికారులకు ధాన్యం అమ్ముట మానుకున్నారు. అందువల్ల కొన్ని సందర్భాలలో బలవంతంగా కమాండీర్ చేస్తున్నారు.

జపాన్ పరిపాలనవల్ల బర్మా ప్రజలకు లభించిన సౌకర్యాలు, హక్కులు, యివి: దోపిడి! పట్టపగలు దోపిడి తప్ప మరొకటికాదు. నేటి బర్మాలో యీ దోపిడీ యూరపులో హిట్లరు కొనసాగించే దోపిడీకే సాటి. గుత్తవ్యాపారం అంతా జపాన్ పెట్టుబడిదారుల్ది. మిగిలినవారంతా బానిసలు.

## అప్పుడు - ఇప్పుడు

1944 ఆగస్టు 1 వ తేదీని బర్మా స్వాతంత్ర్య దేశమనీ, దానికి డాక్టరు బా-మా అధ్యక్షుడనీ, టోకియో (జపాన్) రేడియో ప్రకటించింది. ఈ స్వాతంత్ర్యం ఎలాంటి స్వాతంత్ర్యమో, బర్మాను నేడు పరిపాలిస్తూన్నది యెవరెవరో చూద్దాం.

డాక్టరు బా - మా బ్రిటిష్ పరిపాలన క్రింద ప్రధాన మంత్రి. 1937 లో చక్రవర్తి దర్బారుకు హాజరయిన బ్రిటిష్ రాజభక్తిపరాయణుడు 1942 లో జైలునుండి పారిపోయి, జపాన్ పాలకుల అండజేరాడు. యూ - బ 1941 లో బర్మా గవర్నరు అంగరక్షకుడుగా పనిచేశాడు. జపాన్ ప్రభుత్వం వచ్చాక, పన్నులశాఖకు మంత్రిగా నియమింపబడ్డాడు. సర్ మాంగ్-గై బర్మా గవర్నరుకు సలహాదారుగా వుండేవాడు. ఇప్పుడు జపాన్ ప్రభుత్వం కింద సుప్రీం కోర్టులో జడ్జీపదవి నాక్రమించాడు. ఇలాగే, అనేకమంది ఒకప్పుడు బ్రిటిష్ ప్రభుత్వ గులాములుగా ఉన్నవారు యిప్పుడు జపాన్ హంతకుల కింద దాసోహంచేస్తూ, పేరుకు మాత్రం స్వతంత్ర ప్రభుత్వ నిర్వాహకులమని బుకాయిస్తున్నారు. నిజమైన ప్రజానాయకులకు కొత్త ప్రభుత్వంలో స్థానం లేదు. అందరూ "ప్రభుభక్తి పారాయణులే" - రాజకీయాలలో వీరు గారడీ విద్య నేర్చిన దురంధరులు. ఉదాహరణకు డాక్టర్ బా — మా విషయం తీసుకుందాం. 132 రు సభ్యులుగల శాసన సభలో యితని పార్టీకి బలం 16 గురు మాత్రమే. ఐనా, అనేక జిత్తులువన్ని, 1937 లో ప్రధానమంత్రి అయాడు. 1940 లో బహిరంగంగా జపాన్ అనుకూల ప్రచారం చేసినందుకు శిక్షింపబడి, బర్మాలో జపాన్ సైన్యాలు ప్రవేశించగానే వాటిని ఆహ్వానించాడు.

బర్మానిజంగా స్వతంత్రదేశమే అయితే, యిట్టి అపహ్నుసిస్టులు అధికారంలో ఉండేవారా?



★ మనరాజకీయాలు : కంభంపాటి సత్యనారాయణ ★

భారత స్వాతంత్ర్యసిద్ధికి

## బ్రిటిష్ కమ్యూనిస్టుల శపథం

బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి హారీ పాలిట్, ఉపాధ్యక్షుడు పామీదత్తు, యీక్రింది ప్రకటన గావిస్తున్నారు:

"బ్రిటిష్ ప్రభు ఐశ్వర్యకంతంతో గాంధీజీ విడుదలవల్ల సంతసం వెలిబుచ్చుతున్నారు. ఆయన త్వరగా ఆరోగ్యవంతుడు కావాలని వాంఛిస్తున్నారు. రాజకీయ ప్రతిష్టంభనను తొలగించడాని కిప్పుడు చక్కని అవకాశం లభించింది. 1942 ఆగస్టునుండి నేటివరకు ఇంత సదవకాశం దొరకనేలేదు. జవహర్లాల్ విడుదలకై కూడా మేము మా ప్రభుత్వంమీద ఒత్తిడి చేస్తున్నాం. కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యుల సమావేశానికి వీలుకలుగజేయవలసిందని ఆందోళన చేస్తున్నాం. కొత్తపరిస్థితుల్ని ఎదుర్కొనడానికి; భారత జాతీయైక్యత సాధ్యమయేటట్లు చేయడానికి; బ్రిటిష్ ప్రతినిధులు భారతదేశ ప్రతినిధులతో సంప్రతింపులు జరిపి, జాతీయ ప్రభుత్వ స్థాపనకై ఒడంబడిక చేసుకోడానికి; భారత దేశరక్షణకు భారతీయు లందరినీ సమీకరించవలసిందని - మేము మా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.....సత్వర భారత స్వాతంత్ర్య సిద్ధికి, ఫాసిజంపై ప్రపంచప్రజల విజయానికి, మా సర్వశక్తులు వినియోగిస్తామని శపథం చేస్తున్నాం."

ఇలాగే నేషనల్ కో-ఆపరేటివ్ మెన్స్ గిల్డు, బ్రిటిష్ చర్చికౌన్సిల్, సోషలిస్టు మెడికల్ ఎసోసియేషన్, కేంబ్రిడ్జి యూనియన్ మొదలైన ప్రజాసంస్థలు, జాతీయ ప్రభుత్వ స్థాపనకై తమ ప్రభుత్వంమీద తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నాయి.

గాంధీజీ, పండిట్ నెహూరు, జిన్నా మొదలైనవారు కలిసి సంప్రతింపులు జరుపుకోడానికి అవకాశమిస్తే, తప్పకుండా వారు దేశపరిస్థితులలో మార్పును తీసుకురాగల్గుతారనీ, కాబట్టి నెహ్రూ, ఆజాద్ మొదలగు కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేయవలసిందనీ, కోరుతూ పార్లమెంటులో లేబరుపార్టీ సభ్యులు కొందరు అమెరికి జాబు వ్రాశారు. "యుద్ధాన్ని గురించి ఈ దేశంలో ప్రజల కెలాంటి సదభిప్రాయం ఉందో, అట్టి అభిప్రాయమే భారతీయులలో కూడా కలగటానికి నిజమైన భారత దేశ ప్రజాప్రతినిధులతో జాతీయప్రభుత్వం స్థాపించబడాలి" అని ఆ జాబులో వ్రాశారు.

ఈవిధంగా నానాటికి బలపడుతూన్న బ్రిటిషు ప్రజాందోళన సామ్రాజ్యవాదుల గుండెల్లో అప్పుడే దడపుట్టించింది. అమెరికాలో బ్రిటిష్ రాయబారిగానున్న లార్డ్ హాలిఫాక్సు గాంధిజీవిడుదల భారతదేశభవిష్యత్తుకు ఎవిధంగాను సహాయపడదన్నాడు. గాంధీజీ ఎన్నడూ యితరపార్టీల నాయకులతో ఏకాభిప్రాయానికి రాలేదట!

దీన్నిబట్టి, జాతీయైక్యత అంటే అధికార వర్గానికి ఎంత గాభరాగావుందో వేరే చెప్ప నవసరంలేదు.

## అమెరీ స్థానంలోనే పోటీ

బర్మింగ్‌హాంలో స్పార్క్-బ్రూక్ డివిజను చాలాకాలంనుంచి కన్సర్వేటివ్ (ప్రభుత్వ) పార్టీకినిలయం. ఇండియాకు స్వాతంత్ర్యం పనికిరాదని వాదించే ప్రబుద్ధులు 1918 నుండీ పార్లమెంటు సభ్యులుగా ఎన్నుకోబడుతున్నారు. మన దేశంలో రాజకీయ ప్రతిష్టంభనకు ముఖ్యకారకుడైన అమెరీ (ఇండియా కార్యదర్శి) ఈనియోజకవర్గంనుండి ఎన్నుకోబడినవాడే. అయితే, ఇప్పుడు అమెరీపాలసీని బలపరిచేవోటరు ఒక్కరుకూడా ఆనియోజక వర్గంలోలేడు. కొద్దిరోజులలో జరుగబోయే పార్లమెంటు ఎన్నికల్లో అమెరీని, అమెరీ పాలసీని, ఓడించి తీరాలనే కాంక్ష అక్కడ ప్రజలలో బలంగా నాటుకుంది. బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ తరపున పామీదత్తు ఆనియోజకవర్గానికి అభ్యర్థిగా నిలబడ్డాడు. ఆయన యీక్రింది విధంగా ఒక ప్రకటన గావించాడు:

"గత 2 సంవత్సరాలనుండి బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ 'అమెరీని తొలగించాలి' అనే నినాదంకింద బ్రహ్మాండమైన ప్రజాపుద్యమాన్ని కొనసాగిస్తోంది. అనేకులు దీన్ని బలపరుస్తున్నారు. స్థానిక కార్మిక సంఘాలు, యితర ప్రజాస్వామిక సంస్థలు నా అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నాయి. లేబర్ పార్టీ తరపున యీ స్థానానికి మరొక అభ్యర్థి వేరేలేడు. మేమంతా కలసి, ఒకే విశాలవంతమైన ప్రజాస్వామ్య కార్యక్రమం కొరకు పోరుసల్పుతాం. మా ఆశయం అంతర్జాతీయ ప్రజాస్వామ్య శక్తులమధ్య సహకారం. ఈ ఆశయం టెహరాన్ సమావేశంలో స్పష్టమైన రూపందాల్చింది. ప్రపంచంలో ఫాసిజాన్ని నామరూపాలు లేకుండా భస్మంచేయాలని మేము కోరుతున్నాం. మిత్రరాజ్యాల విజయం కొరకు పనిచేస్తున్నాం. భారత స్వాతంత్ర్యంసిద్ధికై మేం ఉవ్విళ్ళూరుతున్నాం. యుద్ధకాలంలో భారతీయ ప్రజాప్రతినిధులతో గూడిన జాతీయప్రభుత్వ స్థాపన చాలా అవసరం.... 8 సంవత్సరాల క్రితం ఈ నియోజక వర్గంలో అమెరీ 9000 వోట్ల మెజారిటీతో గెల్చినమాట వాస్తవమే. కాని, అప్పటికీ - యిప్పటికీ ప్రజాభిప్రాయంలో అనేక మార్పులు వచ్చాయి."

ఇట్టి ఉన్నత ఆశయాలకొరకు పోటీ చేస్తూన్న పామీదత్తుకు విజయం తప్పక లభిస్తుంది.

## "ముస్లిం మజిలీల"కు విన్నపం

"మనలో మనకు గల అభిప్రాయభేదాలను రూపుమాపుకోలేక పోయినట్లయితే, ప్రపంచం మనల్ని క్షమించదు."

—అంటూ అఖిలభారతముస్లింలీగ్ కమిటీ సభ్యుడైన ఖలీకుజమాన్ తంజావూరు జిల్లా ముస్లింలీగ్ సమావేశంలో ఉపన్యసించాడు. గాంధీజీ విడుదల భారతదేశ సమస్యా పరిష్కారానికి తోడ్పడగలదని ఆయన ఆశించాడు. ఇండియా అంతా ఏకఖండం అనే సిద్ధాంతాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు బలపరుస్తున్నారంటే, వారి ఉద్దేశం భారతీయులలో చీలికలు పెట్టి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడమేగాని, మరొకటికాదన్నాడు. జిన్నా - గాంధీజీలు కలిసి సంప్రతించుకోవడానికి యిప్పుడెట్టి ఆటంకాలు లేవన్నాడు.

కాని, యిటీవల కొత్తగా స్థాపించబడ్డ "ముస్లిం మజిలీల" పాలసీమాత్రం అగమ్యగోచరంగావుంది. ఒకవైపు ముస్లింజాతులకు స్వయంనిర్ణయహక్కు, విడిపోయేహక్కు, ఉండి తీరాలని తీర్మానిస్తూ, మరొకవైపు తాము పాకిస్థాన్ కోర్కెకు వ్యతిరేకమని "ముస్లింమజిలీల"అధ్యక్షుడు ప్రకటిస్తున్నాడు. వెంటనే, యీ రోజున, ముస్లింప్రజలు భారతదేశాన్నుండి విడిపోవాలని వాదించగల ఏ ముస్లిం నాయకుడు చెప్పడంలేదు. అట్టిచో, రెండు పోటీ సంస్థలు ఉండవలసిన అవసరంలేనేలేదు. మాటలపై వాదోపవాదాలేగాని, ముఖ్యసూత్రాలలో భేదం కనబడ్డంలేదు. కాంగ్రెసుతో ముస్లింలీగ్ రాజీకి రాగలిగితే, తమకెట్టి ఆక్షేపణలేదని "ముస్లిం మజిలీల" దృక్పథం. తామట్టి రాజీకి అడ్డురామనికూడా తెలియజేస్తున్నారు. కాని, రాజీ జరుగకుండా జిన్నా అడ్డువస్తే, ముస్లిం ప్రజల తరపున తామే కాంగ్రెసుతో సంప్రదింపులు జరపవలసివస్తుందని భావిస్తున్నారు. ముస్లిం ప్రజాసామాన్యాన్ని తమ నినాదాలపై సమీకరించుతామని తెలియజేస్తున్నారు.

దీని అర్థమేమిటి? కాంగ్రెసు - లీగ్ ఐక్యతను "ముస్లింమజిలీలు" ఆహ్వానించుతున్నారు. కాని, తామందుకు ఎట్టిప్రయత్నం చేయ నిరాకరించుతున్నారు. పైగా, రాజీ జరగకపోతే ముస్లింలీగ్‌తో కత్తిగట్టడానికి సిద్ధంగా ఉన్నారు! ముస్లింలీగ్‌ను ఏ విధంగానూ మార్చడానికి ఇది మార్గంకాదు; చీకాకు పరచడానికే ఉపయోగిస్తుంది. అంతేకాదు. ముస్లిం లీగ్ లో ఉన్న రాజీని వ్యతిరేకించేవారికి యింకా బలంచేకూర్చి పెట్టడమే అవుతుంది. ఇంతేగాక, బెంగాల్, సింధు, పంజాబ్ రాష్ట్రాలలో ముస్లింలీగ్ మంత్రివర్గాలకు వ్యతిరేకంగా హిందూమహాసభ నాయకులు చేసే విచ్ఛిన్న ప్రయత్నాలకు సాయంచేయడమన్నమాట.

కాబట్టి, "ముస్లిం మజిలీలు" లీగ్‌కు పోటీగా పనిచేయడంవల్ల హిందూ - ముస్లిం సమస్యను పరిష్కరించవచ్చుననే పొరబాటు అభిప్రాయాన్ని విడిచిపెట్టాలి; కాంగ్రెసుతో రాజీ జయప్రదమయేటట్లు లీగ్‌తో సహకారం చేయాలి.

## వార్తలు - విశేషాలు

● జుహూలో విశ్రాంతి తీసుకొంటూన్న మహాత్ముడు "మాస్కో-రాయబారం" అనే రష్యన్ ఫిలిం చూచాడు. మాస్కోలో యునైటెడ్‌స్టేట్సు ఆఫ్ అమెరికా రాయబారిగాఉండిన జోసఫ్ డేవీస్, అక్కడి తన అనుభవాలను పుస్తకంగా రాశాడు. దానినే ఈఫిల్ముగా తీశారు.

● ఇండియా ప్రభుత్వానికీ—శ్రీమతి సరోజనికీ మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలవల్ల, ఆమెపై విధించబడిన నిషేధాజ్ఞను ప్రభుత్వం రద్దుచేయదలచుకోనట్లు తెలుస్తోంది.

● పుదుచ్చేరి (ఫ్రెంచి ఇండియా)లో "ప్రతిఘటన" అనే ఫాసిస్టువ్యతిరేక ప్రజాసంస్థకు అధ్యక్షుడైన కామ్రేడ్ వి. సుబ్బయ్యనుఅక్కడినుంచి వెళ్లిపొమ్మని ఉత్తరువు జారీచేసిన స్థానిక ప్రభుత్వ చర్యను వివిధ కార్మికసంస్థలు, ఫ్రెంచి ఇండియా అసెంబ్లీ మెంబరు శ్రీ అరంగస్వామి నాయకర్, మొదలయినవారు ఖండిస్తూ ప్రకటనలు గావించారు.

● పంజాబ్ గవర్నరు అదనంగా యిద్దరిని పంజాబ్ మంత్రివర్గంలో చేర్చుకున్నాడు. వారు: మహమ్మద్ జమాల్‌ఖాన్ లహారీ; నవాబ్ ఆసిక్ హుసేన్.

● యుద్ధానంతరం భారతదేశాభివృద్ధికై యిటీవల భారతీయ పారిశ్రామిక నిపుణులు ప్రచురించిన ప్రణాళికను "ఎకానమిస్టు" అనే బ్రిటిష్ పెట్టుబడివారుల పత్రిక లేనిపోని ఆరోపణలతో, అసహ్యంగా, ఖండించింది.

● బరోడా సంస్థాన ప్రజామండలి సమావేశానికి 300 మంది ప్రతినిధులు, 4000 మంది ప్రేక్షకులు హాజరయారు. ప్రజాప్రతినిధులతో గూడిన "బాధ్యతాయుత ప్రభుత్వం" స్థాపించబడాలని కోరుతూ మహాసభలో తీర్మానించబడింది.

● ఉరితీయబడ్డ 4గురు కయ్యూరు నాయకుల కుటుంబాలకు సహాయం పంపుటకై లండన్‌లో యింతవరకు 10,950 రూపాయలు వసూలయింది. ఈ నిధి యింతటితో ఆపివేయబడింది.

● బెంగాల్ కరువునివారణ నిధికి లండన్‌లో యీ నెల 14వ తేదీని ఒక బ్రహ్మాండమైన సంగీతప్రదర్శనం ఏర్పాటుజేయబడింది. మొత్తం 8,000 మంది బ్రిటిష్ పౌరులు వచ్చారు. 3,75,000 రూపాయలవరకు వసూలైంది.

● భారతదేశ వర్తకశిఖామణులు అస్ట్రేలియాకు ఎందుకూ పనికిరానిబట్టను ఎగుమతి చేసి, అక్కడి వర్తకుల్ని మోసం చేశారని అస్ట్రేలియన్ పత్రికలు తిట్టిపోస్తున్నాయి.

● లండన్‌లో జరుగవలసిన ప్రపంచ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తాత్కాలికంగా ఆపుజేయ బడినప్పటికీ, కామ్రేడ్ డాంగే (అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు) అక్కడజరిగే మరికొన్ని సమావేశాలకు హాజరుకాబోతున్నాడు.

● మహారాష్ట్ర కాంగ్రెసుకమిటీ కార్యదర్శి దేశపాండ్యా ఎట్టిషరతులు లేకుండ విడుదల చేయబడ్డాడు.

# మహాత్ముని విడుదల: ప్రజలపండుగ

మహాత్ముడు విడుదలయ్యాడనే సరికి వెలుగోడు (కర్నూలుజిల్లా) ప్రజలకు పెద్ద పండుగయింది. 11 వ తేదీని పచ్చ తోరణాలతోను, పూలమాలలతోను ఒక రథాన్ని అలంకరించారు. ఎర్రజెండాలను దాని కట్టారు. మహాత్ముని పటాన్ని పెట్టారు. ఇటూ ఇటూ యితర నాయకుల ఫోటోలు. 'నాయకులను విడుదలచేయాలి' 'కాంగ్రెసు దీసుబు కలవాలి', 'ఆహారసమస్యను పరిష్కరించాలి' మొదలయిన నినాదాలతో సంగాలు, తప్పెట్లతో, అంతులేని ఉత్సాహంతో, ఊరేగింపు ప్రారంభించారు. హిందూ ముస్లిం అనే భేదం లేకుండా సుమారు 800 మంది ఈఊరేగింపులో పాల్గొన్నారు.

ఊరేగింపు అనంతరం యిదివరకు యం. ఎల్. ఏ. గా ఉండిన శ్రీ చంద్రా వెంకటరెడ్డిగారి అధ్యక్షతను సభజరిగింది. జిల్లా రైతుసంఘాధ్యక్షుడు ని. పుల్లారెడ్డిగారు ఉపన్యసించారు. గాంధిజీ విడుదల ప్రజాశక్తి కొక విజయం అన్నారు. దేశం జపాను దండయాత్ర నెదుర్కొంటున్న రోజుల్లో ఈవిజయం ఎంత ప్రాముఖ్యమో వివరించారు. నెహ్రూ మొదలయిన యితర నాయకులను కూడా ప్రజాబలంతో విడిపించుకోవాలని అధ్యక్షులు ఉద్బోధించారు. ఎంతో ఉత్తేజితులై ప్రజలు ఇళ్ళకు వెళ్ళారు.

## రైల్వేకార్మికుల సంతసం

గుత్తి (అనంతపురం జిల్లా) లో ఆరో జునే 850 మంది రైల్వే కార్మికులు సమావేశమై మహాత్ముని విడుదలకు సంతోషం వెలిబుచ్చారు.

# అఖిలభారత సోవియట్ మిత్రమండలి మహాసభ

బొంబాయి సోవియటు మిత్రమండలి అధ్యక్షులును, సోవియటు మిత్రమండలి యొక్క అఖిలభారత మహాసభయొక్క ఆహ్వానసంఘ కార్యదర్శియు నగు క్రైస్ట్ గారిలా వ్రాయుచున్నారు:

"సోవియట్ మిత్రమండలియొక్క అఖిలభారతమహాసభ ఈయేడు బొంబాయిలో జూన్ 3, 4 వ తేదీలలో జరుగుతుంది. సోవియటు మిత్రమండలియొక్క వివిధశాఖలు (మొత్తం 15 శాఖలున్నాయి). చేస్తున్నకృషిని సమన్వయపరచి, కేంద్రీకృతం చేయడానికి ఈ సభ ఉద్దేశింపబడింది.

"సోవియటు మిత్రమండలియొక్క ఆశయం, సోవియటు ప్రజలకు-మన ప్రజలకు మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందింపజేయడం. అందుకుగాను పరస్పరం ఈ యిరుదేశాల సంస్కృతిని, సాధించిన విజయాలను, బాగా చదివి తెలిసికొని, సానుభూతితో అర్థంచేసుకోవాలి. సోవియటు మిత్రమండలి ఉద్యమంలో, మన భారతీయులు ఎందుకు శ్రద్ధతీసుకోవాలో చెప్పాలంటే, దానికి కారణాలు చాలా ఉన్నాయి. చైనాలాగనే, సోవియటుకూడా మనకు పొరుగుదేశం. గత 25 ఏండ్లలో రష్యాలో అనేక ముఖ్య ఘటనలు జరిగాయి. అవి మనకు హెచ్చరికలనిస్తున్నాయి. కాని ఇదే కాలంలో సోవియటు యూనియన్ సోషలిజం క్రింద నిర్మాణాత్మకమైన అనేక విజయాలను సాధించింది. దరిద్రంతో, నిరక్షరాస్యతతో, రాజకీయంగా బానిసత్వంతో, బాధపడుతున్న సోవియటు సాధించిన ఆ విజయాలు మనల్ని ఉత్సాహపరుస్తాయి. ఈ సందర్భంలో 1941 డిసెంబరులో కాంగ్రెసు వర్కింగు కమిటీ గావించిన తీర్మానాన్ని ఇక్కడ ఉదహరిస్తున్నాను: "మానవజాతి అభ్యుదయ వికాసాలకు అత్యంతావశ్యకమైన కొన్ని సాంఘిక వైజ్ఞానిక ఆశయాలకోసం సోవియట్ యూనియన్ పనిచేసింది. యుద్ధరాక్షసివల్ల గనక సోవియట్ సాధించిన ఈ విజయాలు, సోవియటు చేసిన ఈ ప్రయత్నాలు, నాశనమయినట్లయితే, అది చాలా దురదృష్టకరమైన విషయం—" అని తీర్మానం. తమ దేశంకోసం, స్వేచ్ఛకోసం సోవియట్ ప్రజలుచూపించే ధైర్య సాహసాలను, అద్భుతమైన స్వార్థత్యాగాన్ని చూచి యీ కాంగ్రెసు వర్కింగుకమిటీ హర్షించుతూ, గాఢమైన సానుభూతిని సోవియట్ ప్రజలకు అందజేసింది. సోవియట్ ప్రజలకు, మనప్రజలకు మధ్యగల స్నేహబంధనం, మనభవిష్యత్తును—మానవజాతి భవిష్యత్తునంతనూ—నిర్ణయించబోతోంది. ఈ రెండుదేశాల క్షేమంకోసం, ఈ స్నేహబంధనాన్ని మరింత గట్టిపరచవలసిందిగా నేను కోరుతున్నాను. అఖిలభారత మహాసభను జయప్రదం చేయవలసిందని కోరుతున్నాను."

## మునిసిపల్ కార్మికుల సమ్మె

ఏడెనిమిదిలక్షల జనాభాగల మహాపట్టణం మద్రాసు. యుద్ధకార్యకలాపాలు జోరుగా సాగుతూన్న ఈ రోజుల్లో మద్రాసు రేవు పట్టణ ప్రాముఖ్యం వేరే చెప్పనక్కరలేదు. ఇలాంటి ముఖ్యపట్టణంలో ఆరోగ్యపరిస్థితులు అల్లకల్లోలంకావడం చాల ఆందోళనకరం. మద్రాసు కార్పొరేషన్‌లోని మూడువేల కార్మికులు తమజీతాన్ని రు. 30 లకున్నూ, యుద్ధ అలవెన్సుని రు. 20 లకున్నూ పెంచాలని కోరారు. ఈ కోరికలపై రాజీ కుదరకపోతే సమ్మె చేస్తామన్నారు. పరిష్కారం కుదరలేదు. ఈ నెల 17 వ తేదీనుంచి సమ్మె ప్రారంభమయింది. ఈ సమ్మెవల్ల కలుగగల ప్రమాదాన్ని ప్రజలు, మునిసిపల్ కార్మికులు, కార్పొరేషన్ అధికారులు గుర్తించి తక్షణం పరిష్కారంకోసం కృషి జరపాలి. (సమ్మె ఆగిందని తరువాత వార్త)

## రైల్వే కార్మికుల కోర్కెలు

రైల్వేరంగంయొక్క ప్రాధాన్యత, రైల్వే కార్మికులను సంతృప్తిపరచవలసినఅవసరం, ఇదివరకు ఎన్నోవిధాల స్పష్టపరిచాం. అధికారులుమాత్రం ఈవిషయాన్ని గుర్తించినట్లు లేదు. గుత్తి(యం.యస్.యం.)రైల్వే కార్మికులు 11 వ తేదీని సమావేశమయి ఈదిగువ కోర్కెలను వెల్లడిచేశారు. కార్మికులకు రు. 30 ల కనీసజీతం వెంటనే అమలు జరపాలని కోరారు. రైల్వేఅధికారులు పెట్టిన పరీక్షలన్నీ ప్యాసయి ఇంజన్‌యగ్జామినర్లుగా పనిచేస్తున్నవారిలో సెలక్షనని కొత్తపద్ధతిని అధికారులుప్రవేశపెట్టారు. దీనివల్ల తమ అభిమానులనే సెలక్టు చేసే అవకాశం అధికారులకు దొరుకుతుంది. ఈపద్ధతిని వెంటనే తొలగించాలనికోరారు. యుద్ధఅలవెన్సు రు 30 లు ఇవ్వాలన్నారు. కార్మికుల న్యాయసమ్మతమైన ఈ కోర్కెలను అధికారు లంగీకరించాలి.

# బెంగాల్ నిధివసూళ్లు

| | రూ. | అ. | పై. |
|---|---|---|---|
| 22-4-44 తేదీ ప్రజాశక్తిలో ప్రకటించిన మొత్తం | 7433 | 0 | 0 |
| మూలపాడు రైతుసంఘం | 13 | 8 | 0 |
| కాచవరం రైతుసంఘం | 2 | 9 | 0 |
| ఈమని గ్రామం నుండి | 35 | 10 | 0 |
| తెనాలి మీటింగు వాగ్దానాలు వసూళ్లు | 200 | 0 | 0 |
| దానం సాంబయ్యగారు తెనాలి | 40 | 0 | 0 |
| సూరపనేని సీతారామయ్యగారు ఇందుపల్లి | 13 | 6 | 0 |
| నారాయణం కేశవాచార్యులు గారు, భట్టిప్రోలు | 10 | 0 | 0 |
| వేదాంతం వెంకట రామాచారి గారు, మూల్పూరు | 8 | 0 | 0 |
| కృష్ణాజిల్లా మహిళాసంఘం రైలులో వసూలు చేసినది | 8 | 7 | 3 |
| అనంతవరం పెండ్లిలో వసూలు | 2 | 5 | 3 |
| మంచికలపూడి యువజన సంఘం | 42 | 7 | 0 |
| ఈమనిలో బుర్రకథలో వసూలు | 1 | 0 | 0 |
| ,, చిల్లర వసూళ్లు | 1 | 0 | 0 |
| నాగభూషణంగారు, నర్సాయపాలెం (గుంటూరుజిల్లా) | 32 | 0 | 0 |
| నల్లమోతు సూర్యనారాయణ గారు | 16 | 0 | 0 |
| యర్రా వెంకన్న, కంకటపాలెం | 10 | 0 | 0 |
| బాపట్ల తా॥ విద్యార్థులవసూలు | 25 | 4 | 0 |
| తమ్మ నానారావు, కోడూరు | 5 | 0 | 0 |
| గట్టివెంకటేశ్వర్లు, పందిళ్ళపల్లి | 2 | 8 | 0 |
| ఆర్. నర్సారెడ్డి. ,, | 0 | 12 | 0 |
| గారపాటి రామశాస్త్రి, పెదపాడు | 70 | 0 | 0 |
| గుత్తా మాణిక్యం, | 50 | 0 | 0 |
| పోతునూరు గ్రామం నుండి | 20 | 0 | 0 |
| రావులపాడు పెండ్లిలో వసూలు | 22 | 6 | 0 |
| కృ॥ జిల్లా వైజ్ఞానిక దళం వసూలు | 12 | 4 | 6 |
| కడపజిల్లా ఆలంఖాన్‌పల్లె | 8 | 0 | 0 |
| బాపట్ల వైజ్ఞానిక దళం | 9 | 2 | 0 |
| గొల్లప్రోలు పెండ్లిలో వసూలు | 29 | 0 | 0 |
| ఒంగోలు ప్రజాశక్తి ఏజంటు ద్వారా | 23 | 0 | 0 |
| వల్లూరిపాలెం పెండ్లిలో | 4 | 0 | 0 |
| దావులూరు బాలసంఘం | 2 | 4 | 6 |
| ,, చిల్లరవసూళ్లు | 0 | 12 | 0 |
| మల్లెల వెంకటేశ్వరరావు, లక్ష్మీపురం | 5 | 0 | 0 |
| వడ్లమూడి పద్దయ్య, గొల్లపూడి | 5 | 0 | 0 |
| జొన్నలగడ్డ రామయ్య, జమ్మవరం | 1 | 0 | 0 |
| టి. లీల (బాలసంఘ సభ్యురాలు)ద్వారా | 4 | 0 | 0 |
| తెన్నేరు పెండ్లిలో వసూలు | 5 | 0 | 0 |
| టి. సత్యనారాయణ, ఈటుకూరు | 2 | 0 | 0 |
| ముత్తేవి శేషాచార్యులు, పెదపులివర్రు | 8 | 0 | 0 |
| వైజాగ్ టౌన్ వసూళ్ళు | 74 | 13 | 9 |

| | రూ. | అ. | పై. |
|---|---|---|---|
| భూపాలరెడ్డి, కొండ్లోపల్లి | 20 | 0 | 0 |
| మొవ్వా అంకమ్మ, నర్సాయపాలెం | 20 | 0 | 0 |
| పర్చూరి గోపాలకృష్ణయ్య అముదాలపల్లి | 9 | 0 | 0 |
| సనకా బుచ్చికోటయ్యగారిద్వారా | 8 | 0 | 0 |
| పాములపాడు పెండ్లిలో | 10 | 0 | 0 |
| పెద్దపుట్టారి బాలసంఘం | 10 | 0 | 0 |
| ,, మహిళాసంఘం | 10 | 0 | 0 |
| యమ్. నరసయ్య, నందిగామ | 1 | 0 | 0 |
| కాకివేయు మీటింగులో | 2 | 10 | 0 |
| పాతపెదపాడు గ్రామం | 39 | 12 | 0 |
| బూరుగుపల్లి అచ్యుతరామయ్య వేలివెన్ను | 50 | 0 | 0 |
| వైజాగ్ డిస్టిలరీ వర్కర్సు యూనియన్ | 30 | 0 | 0 |
| గర్నెపూడి సీతారామయ్య, కొడూరు | 5 | 0 | 0 |
| కోడూరు (ముదినేపల్లి పోస్టు) యువజన సంఘం | 3 | 0 | 0 |
| కోనేరు రత్తయ్య, మంత్రిపాలెం | 8 | 0 | 0 |
| డి. నాగేశ్వరరావు | 5 | 0 | 0 |
| జొన్నలగడ్డ లక్ష్మయ్య | 4 | 0 | 0 |
| చిత్తూరుజిల్లా జి. బాలకృష్ణారెడ్డి | 5 | 0 | 0 |
| ,, కె. రంగయ్యనాయుడు | 4 | 0 | 0 |
| ,, ఆర్. వెంకట్రామానాయుడు | 5 | 0 | 0 |
| ,, సి. హెచ్. వెంకటస్వామి నాయుడు | 5 | 0 | 0 |
| ,, యం. నారాయణస్వామిరెడ్డి | 1 | 0 | 0 |
| ,, కె. పద్మనాభపిళ్లె | 2 | 0 | 0 |
| ,, జి. గోవిందప్పనాయుడు | 1 | 0 | 0 |
| ,, ఇ. చెంగమనాయుడు | 0 | 8 | 0 |
| ,, టి. వెంకట్రామనాయుడు | 0 | 8 | 0 |
| ,, ఆర్. నర్సమనాయుడు | 2 | 0 | 0 |
| ,, కె. వెంకట్రాయపిళ్ళె | 2 | 0 | 0 |
| ,, సి. హెచ్. వేణుగోపాలనాయుడు | 2 | 0 | 0 |
| ,, వి. రామానాయుడు | 1 | 0 | 0 |
| నాగాయితిప్పలో బుర్రకథలో | 19 | 0 | 0 |
| వల్లభనేని గోపాలంగారు | 1 | 0 | 0 |
| కొడాలినారయ్యగారు కురుమద్దాలి | 5 | 0 | 0 |
| మాచినేని వెంకటేశ్వరరావుగారి వసూలు | 0 | 13 | 3 |
| యం. కోటేశ్వరరావుగారు వెల్లటూరు వసూలు | 9 | 8 | 0 |
| చిల్లరవసూళ్లు | 0 | 8 | 6 |
| | 8,560 | 0 | 0 |

ఈ మొత్తంలో 22-4-44 తేదీని పీపుల్సు రిలీఫ్ కమిటీకి పంపిన రు. 7433 లు పోను మిగిలిన రు. 1127 లు ఈ రోజున వారికి పంపబడినాయి.

బెజవాడ
19—5—44 } సంపాదకవర్గం.



# బెంగాల్ గతి మనకు పట్టనివ్వకూడదు

పుష్కలమైన పాడిపంటలకు పేరు పొందాయి కృష్ణా, గుంటూరు, గోదావరి మొదలైన ఆంధ్ర జిల్లాలు. తాము తిని ఇతరులకింత పెట్టగలిగి ఉండేవారు ఈ జిల్లాల వారు. ఆహారపదార్థాలకొరత తమ యిరుపంచలకు చేరలేదనే ధీమాతో నిశ్చింతగ ఉండేవారు, నిన్న మొన్నటి వరకూను.

కాని నేడు గుంపులు గుంపులుగా ప్రజలు అధికార్లవద్దకు వెళ్లి, "అయ్యా బియ్యం ఇప్పించండ"ని ప్రాధేయపడుతున్నారు. (నరసారావుపేట). ఎర్రని ఎండలో నెత్తిపై గోతములు వేసుకు ఎంత తిరిగినా, ఎక్కడా గింజలు దొరక్క పోయాయి. (గుంటూరు) ఆకలితో మలమల మాడుతూన్న వర్తకులు, ధాన్యపుబస్తాలతో పోతూన్నబళ్ల నడ్డగించి కంట్రోలు ధరలకు వాటిని పంచిపెట్టించుకుంటున్నారు. (పేరాల). బందరులో మంచి రకం బియ్యం మాయమయి, నాసిరకం అంగళ్ళలో ప్రత్యక్షమయాయి. బెజవాడలోనూ బియ్యం దొరకడం కష్టమౌతూంది. చేయిజారనిస్తే పరిస్థితులు దారుణంగా పరిణమించేజాడలు నేడు ఎటుచూచినా కనబడుతున్నాయి.

## బెంగాల్ పాఠం

"స్వర్ణభూమి" బెంగాలుకి పట్టినగతికి దేశమంతా జలదరించింది. తిండిదొంగలు, అధికారుల అసమర్థత, అందుకు కారణాలని గుర్తించి, తాముకూడా వాటి బారిపడకుండా జాగ్రత్తపడ నిశ్చయించుకున్నారు ఇతర ప్రాంతాల ప్రజలు. తిండిదొంగలదే పైచేయి కాకుండా అరికట్టాలని ఆంధ్రలో రైతుల్లోను, ఇతరప్రజల్లోను ప్రచారంచేశారు దేశభక్తులు. ధరల కంట్రోలును, రేషనింగును అన్నిప్రాంతాల్లో అమలుజరపాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ప్రజా ఆహారకమిటీల సహకారంతో కృషిసాగించాలని సలహా లిచ్చారు.

ఈఆందోళన ఫలితంగా ఏప్రిల్ నెలలో గుంటూరుజిల్లా కలెక్టరు ధాన్యం, బియ్యం, ధరలు కంట్రోలు చేశారు. కంట్రోలుకు పూర్వం 174 పౌనులుగల ధాన్యం బస్తా రు. 13 లు; కంట్రోలుధర 166 పౌనులుగల బస్తా రు. 10-4-0. రు. 27 లు అమ్ముతూండిన 246 పౌనుల బియ్యంబస్తా కంట్రోలు ధర రు. 24-4-0. ధరలు ఇష్టంవచ్చినట్లు పెంచి అధికలాభాలు దోచేస్తున్న వర్తకులకు, బియ్యంమిల్లు యజమానులకు, ఈకంట్రోలు పిడుగుపడినట్లయింది. మిల్లులుమూసివేశారు. ఉన్నస్టాకులు దాచేశారు. దీనికి తోడు, కంట్రోలుధర గిట్టుబాటుగాక రైతు ధాన్యం బిగబట్టుక్కూర్చున్నాడు. కంట్రోలు సక్రమంగా అమలుజరపడానికి అధికారుల దగ్గర స్టాకులేదు.

దొంగ మార్కెట్టు విజృంభించింది. రహస్య గిడ్డంగుల్లోని పెచ్చు ధరలకు కొనలేక చిల్లర వర్తకులు మూలబడ్డారు. దానితో ప్రజల అవస్థ చెప్పతరం కాకుండాపోయింది.

నరసారావుపేటలో అధికారుల ప్రవర్తన ఈ తిండిదొంగల ఆగడాలకు తోడయింది. 4 వ తేదీన వర్తకులు రహస్యంగా దొంగ మార్కెట్టుకు సాగనంపుతూన్న 62 బస్తాల బియ్యాన్ని, 4 బస్తాల నూకల్ని, కమ్యూనిస్టు వాలంటీర్లు, పట్టి తాసీల్దారుకు వప్పగించారు. కాని రెండు గంటల్లో తిండిదొంగలు తప్పుడు రశీదులు పుట్టించి తమ సరుకు తీసుకుపోగలిగారు. ఆరోజునుంచి తిండిదొంగలికి పట్టపగ్గాలు లేకపోయాయి.

## ఆహారకమిటీలు

ఇలాంటి భయంకరపరిస్థితుల్ని ఎదుర్కోటానికి గుంటూరులో ఐక్య ఆహారకమిటీ ఏర్పడింది. నరసారావుపేటలో అన్ని వర్గాల నుంచి 15 మంది సభ్యులుగల ఆహారకమిటీని ఏర్పర్చుకున్నారు. దీనిలో లాయర్లు, ఇతర పురప్రముఖులు, కమ్యూనిస్టులు ఉన్నారు.

ఈ కృషికి అధికార్లు అడ్డుతగలజూచారు. నరసారావుపేటలో ఆహారసభ జరుగుతూంటే 144 వ సెక్షన్‌కింద అధికారులు దాన్ని నిషేధించారు. కరువు నివారణకు ఎక్కువగా కృషిచేస్తున్న నలుగురు కమ్యూనిస్టు ప్రముఖులపై నెలరోజుల వరకు ఆహారసమస్యపై మాట్లాడకూడదని ఉత్తరువు జారీచేశారు. ఇలా మొండికాలెంత అడ్డుపెట్టినా ప్రజాకృషి ఫలించక ఆగలేదు.

ఈ కమిటీలు తిండిదొంగల పాలిట, నిరంకుశాధికారుల పాలిట సింహస్వప్నాలయాయి. చివరకు ప్రజాసంస్థల శక్తికి లొంగక తప్పిందికాదు. మొదటనుంచీ ఎన్నో ఆటంకాలు కల్పిస్తూ వచ్చిన నరసారావుపేట తహసీల్దారు పట్నానికి కావలసిన బియ్యం కొనడానికి 12 వ తేదీన స్వయంగా తెనాలి వెళ్ళక తప్పిందిగాదు. అంతకుముందే కోఆపరేటివ్ స్టోర్సుకు కొంత ధాన్యం వప్పగించారు. రేషనింగుకు తాత్కాలిక పర్మిట్లను తయారుచేసి, ఆహారకమిటీ వలంటీర్ల సహకారంతో పంచిపెట్టారు.

గుంటూరులో ఆహారకమిటీ సమావేశమై బస్తాధాన్యంధర రూ 11 నిర్ణయించాలని కలక్టరుని కోరారు. ఇలా నిర్ణయించాలని రైతుసంఘాలు తీవ్రంగా ఆందోళన చేస్తున్నాయి. కొట్లవద్ద కాపలాఉండి సరకు కంట్రోలుధరకు ప్రజలకందేలా చేయడానికి ఆహారకమిటీ వలంటీరుదళాలను నిర్మించారు. వర్తకులు గుడ్డిగా ఈ ప్రయత్నాల నెదుర్కోజూచారు. ప్రజలను బెదరగొట్టబోయారు. కాని లాభం లేకపోయింది. కిమ్మనకుండా కంట్రోలుధరకే అమ్మక తప్పిందికాదు. పొరుగూళ్ళ చిన్న దుకాణదారులనుంచి ఎక్కువధరలు వసూలు చేసి బస్తాలకొలదిదాటవేశారు. ఆహారకమిటీ ఈపన్నాగాన్నికూడా ఎదుర్కొంది. రూపాయికి ఖరీదైన బియ్యం ఇవ్వవలసినదని కలక్టరుచేత అర్డరు జారీచేయించింది. ఎక్కువ ధరకు సరుకుకొన్న దుకాణవారులను కనిపెట్టి, వాళ్ల చేత కూడ కంట్రోలు ధరకే అమ్మించింది. అనష్టానికి వారు గాభరాపడి దొంగతనంగా కొనడం మానివేశారు. ఈ విధంగా ప్రజల ఆహారకమిటీ తిండిదొంగలను జయప్రదంగా అరికట్టగలిగింది. కలక్టరు ధాన్యం బస్తా రు 11 లు (గోనెతో 11-9-7)నిర్ణయించారు.

రాయలసీమలోని ఉరవకొండ సబ్ తాలూకాలో కూడా తిండిదొంగలను అరికట్టడానికి కమ్యూనిస్టులు, ప్రజారక్షణదళం తీవ్రంగా కృషిచేస్తూన్నారు.

ఇంత మాత్రంచేత బాధ్యత తీరిపోయిందనుకోకూడదు. కంట్రోలు, రేషనింగు జయప్రదంగా అమలుజరపడానికి తగినంతస్టాకు ప్రజాసంస్థల అందుబాటులో ఉన్ననాడే బెంగాల్ గతి మనకు తప్పుతుంది. ఈ స్టాకును నిల్వచేయడానికి అధికార్లు ఆహారకమిటీల సహకారంతో వెంటనే కృషి ప్రారంభించాలి: వెంటనే రేషనింగు అమలుజరపాలి!!

# ధాన్యపు కమాండీరింగు

# రైతుల యిబ్బందులు

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ అధ్యక్షుడు కడియాల గోపాలరావుగారు ఈ దిగువ ప్రకటన చేయుచున్నారు:

కొరతప్రాంతాలకు పంపడానికి, పట్టణాలలో రేషనింగు అమలు జరుపటానికి, ప్రభుత్వము ధాన్యపు కొనుగోలు అధికారిద్వారా ధాన్యమును రైతులనుండి కమాండీరుచేస్తోంది. తమ మిగులు ధాన్యమును ఇచ్చివేయడానికి రైతులు ఎప్పుడూ సిద్ధమే. కాని ప్రభుత్వము వడ్లకు, బియ్యానికి నిర్ణయించిన గరిష్టధరలలో మిల్లు యజమానికి ఎక్కువ లాభము పోతోంది. రైతులు ధాన్యమును అమ్మటకు ముందుకురాక, బియ్యాన్ని ఆడించి ఇవ్వడానికి ఇష్టపడ్డారు. అందుచేత రైతులే వడ్లను మిల్లుచేయించి బియ్యాన్ని ఇచ్చే వీలుకలుగజేయాలని క్రిందటి సంవత్సరము ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము ఆందోళన చేసింది. ఈ విషయమై ప్రభుత్వమువద్దకు రాయబారం వెళ్ళింది. రైతులు బియ్యాన్నిచేసి ఇవ్వడానికి కావలసిన మిల్లు సౌకర్యాలు కలుగజేయడానికి ప్రభుత్వము అంగీకరించింది.

ప్రస్తుతము ధాన్యపు కొనుగోలు అధికార్లు చేసే కమాండీరింగులో రైతులకు కొన్ని యిబ్బందులు కల్గుతున్నాయి. దగ్గరనున్న మిల్లులలో బియ్యమాడించే అవకాశాలు కల్పించకుండా దూరమున ఉన్న మిల్లులకు ధాన్యాన్నితోలమంటున్నారు. ఉదాహరణకు—కృష్ణాజిల్లాలో కుందేరు, ఆకుకూరు మొదలగు గ్రామాలలో కమాండీరు చేసినప్పుడు 3, 4 మైళ్ళలో నున్న మిల్లులను వదలిపెట్టి, 17, 18 మైళ్ళలో నున్న బెజవాడకు తోలమన్నారు. వ్యవసాయపని తరుణము నెత్తిమీద కొచ్చిన ఈ రోజులలో పైవిధంగా దూరపుమిల్లులకు తోలమనుటచేత రైతులు వ్యయ ప్రయాసలకు గురిఅవుతున్నారు. పుటలలోనున్న ధాన్యపుమొత్తాలను నిర్ణయించటంలో స్థానికాధికారుల లెక్కలపై ఆధారపడి మొత్తాలను చాలాఎక్కువగా నిర్ణయించుచున్నారు. కమాండీరు చేసిన తరువాత 5 రోజులలోనే ధాన్యమును మిల్లుకుచేర్చాలని నోటీసులు అందజేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. రవాణా సౌకర్యములను దృష్టిలో పెట్టుకోకుండా కమాండీరు చేయుటజరుగుతోంది. కాలువల్లో నీరు వచ్చిన తరువాత బస్తా రు 0-2-0 కిరాయితో వచ్చేది. ఇప్పుడు రు 0-8-0 కిరాయితో బండ్లమీద తోలుకు రావలసివస్తున్నది. కాల్వలు వచ్చి, వర్షములు పడ్డ తర్వాత ధాన్యము రావడానికి వీలులేని గ్రామాలు ఇప్పుడు వదలివేయబడుచున్నాయి. కాబట్టి రైతులకు పైఇబ్బందులు లేకుండుటకుగాను ధాన్యపు కొనుగోలు అధికార్లు ఈక్రింది సూచనలు పాటించ వలసినదిగా కోరుతున్నాను.

1. ధాన్యమును కమాండీరుచేయునప్పుడు స్థానిక రైతుసంఘ ప్రతినిధియొక్క గాని, రైతుసంఘాలులేనిచోట గ్రామపెద్దలయొక్క సహకారముతో కమాండీరు చేయు అధికారే స్వయంగా లెక్కలువేసి మొత్తాలను నిర్ణయించాలి.

2. కమాండీరుచేసిన ధాన్యమును దగ్గరలో నున్న మిల్లులో బియ్యమును ఆడించి ఇవ్వడానికి సౌకర్యాలు కలుగజేయాలి. పట్టణాలకు బియ్యము కావలసివస్తే దగ్గర గ్రామాలలో నున్న ధాన్యాన్ని కమాండీరు చేయాలి.

3. కమాండీరు చేయుటలో రవాణా సౌకర్యాలను చూడాలి. కాల్వలలో నీరు వచ్చినతరువాత చాలతేలికగా చేర్చడానికి వీలున్న గ్రామాలు వదిలి, కాల్వలు వచ్చిన తరువాత ధాన్యము చేర్చడానికి వీలులేని గ్రామాలలో ముందుగా కమాండీరు చేయాలి. దీని అర్థము కొరతప్రాంతాలలో బియ్యము కొరకు ఇబ్బంది పడుతుంటే కూడా చేయవద్దనికాదు.

4. కమాండీరు చేసినతరువాత బియ్యము ఆడించి ఇవ్వడానికి కనీసము 10 రోజులు వ్యవధి ఉండాలి.

5. కమాండీరుచేయునప్పుడు వ్యవసాయ ఖర్చులకు, కుటుంబావసరాలకు సరిపడు ధాన్యాన్ని వదలాలి.

6. గ్రామ మొత్తముమీద దాని అవసరాలకు సరిపోవు ధాన్యాన్ని వదలిపెట్టాలి.

ఈ పనులన్నిటినీ గ్రామ రైతుసంఘాల సహకారముతో చేయాలి. ఆ విధముగా చేయుటచే కొరతప్రాంతాలకు పంపడానికి ధాన్యము పుష్కలంగా వస్తుంది. రైతుకూ ఇబ్బంది లేకుండపోతుంది. గ్రామ రైతుసంఘాలు ధాన్యపు కంట్రోలును జయప్రదం చేయడానికి ఆహారము తిండిదొంగల చేతుల లోకి పోకుండా కాపాడి, దేశాన్ని కరువునుండి, జపానుదాడినుండి రక్షించుటకుగాను పైవిధముగా చొరవతో పనిచేయాలని కోరుచున్నాను.

★ యుద్ధ సమీక్ష

# బర్మా యుద్ధం మందగించడంవల్ల చైనాకు కలుగుతూన్న నష్టం

— తుమ్మల వెంకటరామయ్య

జపాను ప్రధాని టోజో 14 వ తేదీని రేడియో ఉపన్యాసం గావించుతూ యుద్ధం అతి ప్రధాన ఘట్టంలో ప్రవేశించిందన్నాడు. జపాన్‌ను కూలద్రోయ ప్రయత్నించే బ్రిటిషు - అమెరికాల ఆశయాన్ని భగ్నంచేస్తానన్నాడు. అందుకు తుదివరకు జపాను పోరాడుతుందని అన్నాడు.

ఈ ఉపన్యాసంలో టోజో వెల్లడించినట్లు గానే, జపాను మొండిగా పోరాడుతోంది. జపాను సేనల మొండిప్రతిఘటనను నాశనం చేసి ఈ వారం మన సైన్యాలు కొన్ని విజయాలను సాధించగల్గాయి.

కొహిమాలో భీకర యుద్ధం జరిగింది. బర్మా యుద్ధరంగంలోకల్ల ఇది తీవ్రయుద్ధం అని విలేఖరు లంటున్నారు. 40 రోజుల యుద్ధఫలితంగా కొహిమాలో 3 వేలమంది శత్రువులు చనిపోయారు. ఈ విజయంతో కొహిమా ప్రదేశంలో అంతటా శత్రువు తుడిచిపెట్టబడ్డారని అర్థంకాదు. కొహిమాకు పశ్చిమోత్తరంగా శత్రువులింకా వుండనే వున్నారు. కొహిమాకు దక్షిణాన పావ్‌వద్ద కూడా కీలకస్థానంలో జపాను పొంచివుంది. ఈ రెండు ప్రదేశాలనుంచి శత్రువులను నిశ్శేషంగా తరిమివేయగలిగినపుడే మన సైన్యాలు ఇంఫాల్ ప్రాంతంలోకూడ శత్రువులపై దెబ్బ తీయగలుగుతాయి. అపుడే దిమాపూర్‌కు నిరాఘాటంగా ప్రయాణం సాగుతుంది. కాని, ఇందుకు కొహిమాలో వలెనే తీవ్రయుద్ధాలు జరగాలి.

ఇంఫాల్ - దిమాపూర్ రోడ్డుయొక్క ప్రాముఖ్యత తెలిసికొనివుంటే, శత్రువు ఇక్కడి అంత మొండిగా ఎందుకు పోరాడుతున్నాడో అర్థమవుతుంది. అస్సాం - బెంగాల్ రైలుమీద దిమాపూర్ రోడ్డువచ్చి కలుస్తుంది. ఈ రైలుమార్గంమీద వున్న "సాడియా"గుండా చీనాకు ఒకే ఒక సప్లయి మార్గం వుంది.

ఇంఫాల్‌కు దక్షిణంగాను, నైరుతిగాను తీవ్రయుద్ధాలు జరుగుతూన్నయి. ఇంఫాల్ దక్షిణాన బిషెన్‌పూర్, నైరుతిని పలెల్ - ఈరెంటూ ఇంఫాల్ మైదానాకి ముఖ్యమైన ముఖద్వారాలు ఈరెండిటికోసం శత్రువు తీవ్రయుద్ధం సాగించుతున్నాడు. బిషెన్‌పూర్‌కు దక్షిణాన ఒక గ్రామంలో మూడువంతులు మన సైన్యాలాక్రమించుకొన్నాయి. ఈ ప్రాంతంలో శత్రువును ముందుకు రానీయకుండా జూస్తున్నాయి.

ఇంఫాల్‌నుండి దిమాపూర్‌కుగాక మరొక రోడ్డు సిల్చార్‌కు పోతుంది. అరస్త్రాలో శత్రువు అనేకచోట్ల గండిగొట్టాడు. ఇపుడు అలాగా పలెల్‌కు ఉత్తరంగా కూడ చొచ్చుకు పోతున్నాడు. ఇదంతా బయట ప్రపంచంతో ఇంఫాల్‌కు సంబంధం సాధ్యమయినంత వరకు తెగ్గొట్టడానికి జపానుచేస్తున్న ప్రయత్నం. ఇపుడు ఈ యుద్ధరంగం సింహావలోకనంచేస్తే మనకు కన్పడేదేమిటి? శత్రువు కొహిమానుండి టిడ్డింవరకు 150 మైళ్ళ పొడుగున అక్కడక్కడ ఉన్నాడు. 50 మైళ్ళ వెడల్పున చొచ్చుకపోయాడు. టిడ్డిం-టాము రోడ్లద్వారావచ్చే సప్లయిలను ఇంఫాల్ మైదాన సమీపానికి తెచ్చుకొనగల్గుతున్నాడు. ఇది జూచే ఆసప్లయి మార్గాలపై మన విమానాలు బాంబుల వర్షం కురిపించుతున్నాయి.

ఇంతకూ తేల్చి చెప్పేదేమంటే, ఇంకా ఈ రంగంలో పూర్తిగా మనది పైచేయి కాలేదు. ఇంఫాల్‌కు ప్రమాదం తప్పనూ లేదు.

అరకాన్ రంగంలో అట్టే విశేషాలు విన రావటంలేదు. కాని ఇచటి 5 వ డివిజన్ ఇంఫాల్‌కు విమానాల ద్వారా కొనిపోబడింది. గస్తీ సైనికుల ఘర్షణలు జరిగాయంటూ కొన్ని వార్తలు వస్తున్నాయి. మన విమానాలు కాలడాన్ - మాయూ - అరకాన్ ప్రదేశాలలో బాంబులు కురిపించుతున్నట్లూ వార్తలు వస్తున్నాయి. దీని అర్థం శత్రువు ఇక్కడ కేంద్రీకరించుతున్నాడన్నమాట. ఇది చిటగాంగ్‌కు ప్రమాదకరం.

ఇక ఉత్తరబర్మాలో, జనరల్ స్టిల్‌వెల్ సేనలు మిచీనాలో ప్రవేశించాయి. మిచీనా 3 వంతులు వశమయింది. వర్షాకాలం రాకముందే మిచీనాను వశంచేసుకోవాలని స్టిల్‌వెల్ తీవ్రంగా ప్రయత్నించాడు. వర్షాకాలం ప్రారంభించితే స్టిల్‌వెల్‌కు సప్లయిలుండవు. మిచీనాను పట్టుకొనకపోతే, తలదాచుకోడానికి వీలులేని స్టిల్‌వెల్ సైన్యాలు, వర్షంవల్ల మలేరియావల్ల, మరింత బాధపడవలసివస్తుంది. స్టిల్‌వెల్, బర్మా - లిడో (చైనా) రోడ్డులను కలిపి, చైనాకు సహాయంచేయాలని యుద్ధం చేస్తున్నాడు. అదికూడా 1944 లోనే పూర్తి కావాలని అతని కోర్కె. మిచీనా గనుక వశంకాకపోతే, అది అసంభవమయ్యేది. వర్షాకాలం సమీపించింది కాబట్టి, చైనా సైన్యాలుకూడ, త్వరితంగా యుద్ధరంగంలో కురకవలసివచ్చింది. ఇతనికి సహాయంగా యూనాన్‌నుండి చైనా సైన్యాలు కొత్తదాడి ప్రారంభించాయి. 150 మైళ్ళ పొడవున యుద్ధంచేస్తూ ముందుకు సాగుతున్నాయి. ఈ రెండు సైన్యాలకు తోడుగా చిండ్విన్ సైన్యాలు (శత్రుసరఫరాలను నాశనం చేయడానికి విమానాలద్వారా దింపబడిన మిత్రసైన్యాలు)కూడ జపానుసేనలు వెనుదిరిగిపోకుండా రాకపోకల్ని భగ్నంచేస్తున్నాయి.

## చైనాలో అనైక్యతకుకారణం

ఈ విధంగా, ఒక్క మన మాతృదేశం కోసమేగాక, చైనాకు రాకపోకలు ఏర్పరచాలని, బ్రిటిషు - అమెరికన్ - భారత - చైనా సైనికులు తమ ప్రాణాలు ధారపోస్తున్నారు. భారతదేశ రాజకీయప్రతిష్టంభన అంతమొందించి, భారతీయుల సహకారం తీసుకొన్నట్లయితే, ఇక్కడ యుద్ధం త్వరలో ముగుస్తుంది. అస్సాం - బర్మా యుద్ధరంగంలో యుద్ధం ఈడ్చుకు పోతున్నకొలదీ, చైనాకు సప్లయిలు అందకపోయినకొలదీ, చైనాలో గుండెనిబ్బరం చెడటానికి అవకాశం ఉంది. దీనికితోడు అభివృద్ధినిరోధకుల ప్రయత్నాల మూలకంగా చైనాలో అనైక్యత కలగడానికి కారణం గూడా అవుతుంది.

ఇప్పుడు చైనాలో పరిస్థితులేమిటి? గత నాల్గువారాలలోను చైనాలో జపాను చెప్పదగిన విజయాలను సాధించింది. పెకింగ్ - హాంకో రైలు మార్గాన్ని చాలవరకు వశం చేసికొంది. చైనాకు 6సార్లు ముఖ్యపట్టణంగా ఉన్న లొయాంగ్‌లో ఇప్పుడు సంకులసమరం సాగుతోంది. లొయాంగ్ వదిపోతే చైనాకు తీరని దెబ్బ.

## కలిసిరానిదెవరు?

ఇట్టి పరిస్థితులలో చైనాలో అభేద్యమైన ఐక్యత అవసరం. కాని ఐక్యతను భగ్నంచేస్తున్నదెవరు? జంగ్-కై-షేక్‌ముఠాయా? కమ్యూనిస్టులా? రష్యా జపాను ఒడంబడిక జరిగిన దగ్గరనుంచీ "రష్యా అనుచరులైన కమ్యూనిస్టులు" కలిసిరావడంలేదనీ; కృష్ణా పత్రిక నిందవేస్తోంది. కృష్ణాపత్రిక వాదన ప్రకారం ఏం తేలుతుంది? రష్యా - జపాను ఒడంబడికమూలంగా, చైనాకు రష్యా ద్రోహం చేసిందని. కాని చరిత్ర తెలిసినవారెవరూ ఇలా అనలేరు. సోవియటుపై జర్మనీ యుద్ధం ప్రకటించేవరకూ, సోవియటు ఒక్కటే చైనాకు సహాయంచేస్తూ వచ్చింది. అమెరికవంటి అభివృద్ధినిరోధకులు చైనాలో జపాను దురాక్రమణను సమర్థించుతున్నపుడు; బర్మారోడ్డును మూసి బ్రిటిషు ప్రభుత్వం చైనాకు నష్టంకల్గించిన రోజులలో కూడ, రష్యాయేఒంటరిగా సహాయంచేసింది ఈసహాయాన్ని జంగ్-కై-షేక్ దంపతులు అనేకసార్లు అంగీకరించారుకూడ. అలాంటి రష్యా ఇపుడు చైనాకు ద్రోహం తలపెడుతున్నదంటే నమ్మే దెవరు? పోనీ ఇపుడు ఈ ఒడంబడిక చైనాకు నష్టం కల్గించుతుందేమో చూద్దాం. ఈ ఒడంబడిక ద్వారా పసిఫిక్ యుద్ధం అయేవరకు జపానుకు చేపలు పట్టుకొనే అధికారాన్ని రష్యాతీసివేసింది. ప్రస్తుత యుద్ధం సమాప్తి అయేవరకు నూనెగాని బొగ్గుగాని తానుజపానుకు సప్లయిచేయనన్నది. ఈ రెండూ ఎవరికి లాభకరం? జపాన్‌కా? కాదు. జపానును నష్టపరచడంఅంటే చైనాకు పరోక్షంగా సహాయం కూడా.

కాబట్టి "రష్యా - జపానుల మిలాఖత్" వల్ల చైనా కమ్యూనిస్టులలో మార్పేమీరాలేదు. రెండవది "రష్యా అనుచరులు" చైనాకమ్యూనిస్టులంటూ మరొకపదం వాడింది కృష్ణాపత్రిక. రష్యాకోసం, చైనా కమ్యూనిస్టులు తమ పాలసీని మార్చుకొన్నారని కృష్ణాపత్రికవాదన. కాని అసలు విషయం ఏమిటి? చైనా కమ్యూనిస్టుల పాలసీ ఏమిటి?

జంగ్-కై-షేక్‌కు, చైనా ఎంత మాతృదేశమో, కమ్యూనిస్టులకు అంతే. జపానుకు లొంగుతూ కమ్యూనిస్టులపై జంగ్-కై-షేక్ ధ్వజం ఎత్తేరోజులలో, జపానునెదిరించడానికి మొట్టమొదట ఐక్యతకై చేయిజాచినవారు కమ్యూనిస్టులు. జంగ్-కై-షేక్ ప్రాణాలు తమ చేతిలో చిక్కినా ప్రాణాలు తీయక, ఐక్యతకోసం పాటుబడినవారూవీరే. అందుచే కమ్యూనిస్టులు ఐక్యతను భగ్నంపరచుతున్నారంటే అర్థంలేదు.

కాని జంగ్-కై-షేక్ చర్యలు ఇందుకు విరుద్ధంగాఉన్నాయి. ఇదివరకు అతడు నాల్గవ కమ్యూనిస్టు సైన్యాధిపతిని చంపించడం ఎరిగినదే. మూడేండ్ల నుండి ఉత్తర చైనాలో కమ్యూనిస్టు సైన్యాలను కదలనీయకుండా 5 లక్షల సైన్యాన్ని అట్టిపెట్టాడని డైలీ మెయిల్ వ్రాస్తోంది. ఇంతఎందుకు? జంగ్-కై-షేక్ వ్రాసిన "చైనా భవిష్యత్తు" అనే గ్రంథంలో కమ్యూనిస్టులపై కారాలు మిరియాలు నూరాడు. దీనిలో ప్రజాస్వామిక వ్యతిరేకభావాల్ని బాగా వెల్లడించాడు. అందుకనే దానిని ఇంగ్లీషులోకి తర్జుమా చేయించడానికి సాహసించలేకపోయాడు. కారణం ప్రజాస్వామ్య దేశాలన్నీ గోలపెడతాయని.

ఈ ప్రజాస్వామ్య వ్యతిరేకధోరణి ప్రజాస్వామ్య దేశాలు కూడా గుర్తించాయి. చైనాలో క్లిష్టపరిస్థితులు సంభవించకుండా జంగ్-కై-షేక్‌కు బోధచేయడానికి హెన్రీవాలాస్ (అమెరికా ఉపాధ్యక్షుడు) పంపబడుతున్నాడు. రూజ్‌వెల్టు "మన భవిష్యత్ శాంతి, అభివృద్ధీ ఆధారపడివున్న అతిప్రాముఖ్య" ప్రదేశానికి వాలాస్ పోతున్నాడని చెప్పడంలో అంతరార్థం ఇదేగావచ్చు. చంకింగ్‌లో, కమ్యూనిస్టుల ప్రతినిధులకు జంగ్-కై-షేక్‌మధ్య జరుగుచున్న సంప్రదింపులు అభేద్యమైన ఐక్యతకు దారితీయాలని కోరుతున్నాం. అందుకు చైనా కమ్యూనిస్టులు తమ యావచ్ఛక్తినీ ఉపయోగించుతారు.

## ఇటలీ

ఇటలీలో మిత్రసైన్యాల పురోగమనం జోరుగా సాగుతోంది. గుస్టావ్, హిట్లరు శ్రేణులను భేదించుకుంటూ మిత్రసైన్యాలు ముందుకు పోతున్నాయి. కాసినో వశమయింది. హిట్లర్ సైన్యాలను సాధ్యమైనన్నిటిని, ఇటలీకి మరలించడానికిగాను మిత్రసైన్యాలు ఇంత పెద్దయెత్తున దెబ్బతీస్తున్నాయి. త్వరలో రోముచేరడానికి ఈ దండయాత్ర ఫలిస్తుందిది. 22—5—44.

(11 వ పేజీ తరువాయి) విస్తుంది. ప్రజలలో ఇమిడిఉన్న నిర్మాణశక్తులు, అవకాశం కలిగితే సాధించగల ఘనకార్యాలకు, ఇదొక చిన్న నిదర్శనం. అంతేకాదు. ఇంత ప్రధానమయిన స్కీమునుకూడా — ఏదో కారణం దొరికేసరికి మూలబెట్టాలనుకొంది ప్రభుత్వం. ప్రజల క్షేమంఅంటే లక్ష్యంలేని నిరంకుశ ప్రభుత్వంకాబట్టి అంతకు పూనుకొంది. బాధ్యత నెరిగిన జాతీయప్రభుత్వమే ఉంటే, అలా చేసేదా? దీనినేకాదు, మూలబడిఉన్న ఇంకెన్నెన్ని స్కీములను సకాలంలో కొనసాగించి, ప్రజలను కరువుకాటకాలనుండి కాపాడ్డానికి పూనుకొనేదో! ఈస్కీము విషయంలో ప్రజాసంస్థలుచూపిన శ్రద్ధ, దీక్షలే ఇందుకు తార్కాణం.

జాతీయప్రభుత్వంయొక్క అవసరాన్ని ఈ ఉదంతం చాటి చెబుతూంది. ఆ ప్రభుత్వపు నాయకత్వంకింద భారతజాతి సాధించగల ఘనకార్యాల కిదొకసూచిక.



# ట్రేడుయూనియన్ రికగ్నిషన్ బిల్లు

## ఆల్ ఇండియా ట్రేడుయూనియన్ కాంగ్రెస్ సూచనలు

క్రిందటి సంవత్సరం అక్టోబరు మాసాంతంలో ఇండియా ప్రభుత్వ కార్మిక శాఖాసభ్యుడు, డాక్టరు అంబేద్కరు, కేంద్రశాసనసభలో ట్రేడ్‌యూనియన్ రికగ్నిషన్ బిల్లును ప్రవేశపెట్టాడు. ఆబిల్లు ప్రజాభిప్రాయం కొరకు ప్రచురించబడింది. దాని ఉద్దేశం ప్రతి ట్రేడుయూనియన్‌ను యజమానులు తప్పని సరిగా గుర్తించేటట్లు చెయ్యడం.

ఈ బిల్లుప్రకారం:

(1) ట్రేడుయూనియన్ సభ్యులందరికి సంబంధించిన విషయాలపై సంప్రతింపులు జరుపుకోడానికి, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోడానికి, యజమానుల్ని యింటర్‌వ్యూ చేయడానికీ అవకాశం ఉంటుంది. అయితే, యజమానులు, కార్మికులు యేకాభిప్రాయానికి వచ్చినప్పటికీ, దాన్ని యజమానులు ఆచరణలో పెట్టకుండా వుంచవచ్చు. యజమాని తన యిష్టం వచ్చినప్పుడు ఉత్తర ప్రత్యుత్తరాలు, సంప్రతింపులు, ఇంటర్‌వ్యూలు ఆపుచేయవచ్చును. యజమానివివాదగ్రస్తమైన యేసమస్యమీద నైనా తన యిష్టం వచ్చిన నిర్ణయానికి రావచ్చును.

(2) రికగ్నైజు చేయబడ్డ యూనియన్ సభ్యులందరికి సంబంధించిన విషయాలలోనే జోక్యం కల్గించుకోవాలి. అంతేగాని, యూనియన్ వ్యక్తులకు సంబంధించిన ప్రత్యేక విషయాలపై జోక్యం కలుగజేసుకోరాదు.

(3) "యూనియన్ సభ్యులందరూ ఒకే పరిశ్రమలో పనిచేస్తూ వుండాలి."

(4) రికగ్నిషన్ కొరకు దరఖాస్తు పెట్టుకునేముందు యూనియన్ ఒక సంవత్సరం ముందే రిజిష్టరై వుండాలి. ట్రేడ్ యూనియన్ ఆక్టు ప్రకారం పనిచేస్తూవుండాలి.

(5) కుల - మత యూనియన్నను ప్రభుత్వం గుర్తించదు.

(6) రికగ్నిషన్ పొందిన యూనియన్ కార్మికులకు ప్రాతినిధ్యం వహించగల్గినదై వుండాలి.

(7) ఇకముందు విధించబోయే ఇతర నిబంధనలను అమలు జరుపుటకు యూనియన్ సిద్ధంగావుండాలి.

(8) యూనియన్ సభ్యులలో యే ఒక్కరూ చట్టవిరుద్ధమైన సమ్మెలలో పాల్గొనరాదు. కార్యనిర్వాహక సభ్యులు చట్టవిరుద్ధమైన సమ్మెలను ప్రోత్సహించకూడదు; యుద్ధ నిర్వహణకు వ్యతిరేకంగా ప్రచారం చేయకూడదు. అలా జరిగితే, రికగ్నిషన్ రద్దు చేయబడుతుంది.

(9) కేంద్రప్రభుత్వ ఆజమాయిషీక్రింద పనిచేసే పరిశ్రమలలో(అనగా, రైల్వే, రేవు, యుద్ధపరిశ్రమ, మొదలయినవి) ప్రభుత్వపు అనుమతిపై తప్ప యీ చట్టం వర్తించదు.

### సవరణలు

దేశరక్షణకై కార్మికులు ఉత్సాహంగా ఉత్పత్తిని అధికం చేయవలసిన యీరోజులలో, కార్మికసంఘాలను యజమానులు రికగ్నైజు చేసేటట్లు శాసించటం అవసరమే గాని, యీ వుద్దేశ్యాన్ని బిల్లు నెరవేర్చడం లేదు. కనుకనే అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కొన్ని ప్రధానమైనసవరణలు చేయాలని సూచించుతూవుంది:

(1) యజమానులు, కార్మికులు కలిసి, సమిష్టిగా గావించుకొన్న నిర్ణయాలను యజమాని నిరంకుశంగా రద్దుచేయరాదు; అమలు జరిపేటట్లు బిల్లును సవరించాలి. ఉభయ పార్టీలమీద ఒడంబడిక షరతులు వర్తించబడేటట్లు చూడాలి. ఇలా జరగకపోతే, సమిష్టి కార్యాచరణకు అవకాశమే వుండదు. అదివరకే యెక్కువ సౌకర్యాలతో రికగ్నిషన్‌ను సంపాదించుకొన్న యూనియన్లు వాటిని పోగొట్టుకోవలసివస్తుంది.

### వ్యక్తిగత ఇబ్బందులు

(2) యూనియన్ సభ్యులలో వ్యక్తులకు సంబంధించిన ప్రత్యేక యిబ్బందులను గూర్చి యూనియన్ జోక్యం కలుగచేసుకొనరాదని విధించడంవల్ల, యజమానుల క్రింది తాబేదారులు కార్మికులపై విచ్చలవిడిగా కొనసాగించే జబర్దస్తీలకు రక్షణ కలిగించడమే అవుతుంది. యూనియన్ సభ్యుల వ్యక్తిగత యిబ్బందుల్ని కూడా యూనియన్ పరిష్కరిస్తేనేగాని, కార్మికులు ఉత్సాహంగా యూనియన్‌లో చేరరు. పరిశ్రమలలో పట్టుదలగా పనిచేయరు. కనుక సమిష్టిహక్కులతోబాటు, వ్యక్తిగత విషయాలలోకూడా యూనియన్ జోక్యం కలిగించుకునే అవకాశం బిల్లులో వుండాలి.

(3) ఈ బిల్లుప్రకారం కొన్ని పరిశ్రమలకు అనుబంధించబడిన కార్మికులు (ముఠా పనివారువగైరా) రికగ్నైజుడుయూనియన్‌లో చేరడానికి వీలుండదు. అందువల్ల ఒకే పరిశ్రమలో పనిచేయు కార్మికులు, దానికి అనుబంధించి పనిచేసే కార్మికులు యూనియన్‌లో చేరవచ్చునని వుండాలి.

"యూనియన్ సభ్యులందరు ఒకే పరిశ్రమలో పనిచేస్తూవుండాలి" అని విధించడం వల్ల, గౌరవ సభ్యులు యూనియన్‌లో వుండవచ్చునా లేదా అనే అనుమానం వస్తుంది. అట్టి అనుమానానికి తావులేకుండా చేయడానికి, "గౌరవసభ్యులు కాని యితర సభ్యులందరు ఒకే పరిశ్రమలో...." అని సవరించాలి.

(4) రికగ్నైజు చేయడానికి ఒక సంవత్సరంముందే యూనియన్ రిజిష్టరైవుండాలి అనే షరతు అనవసరం. ఎందుకంటే, యూనియనులను రిజిష్టరు చేయటానికి రిజిష్ట్రారు చాలా కాలం తీసుకుంటున్నాడు. ఈవ్యవధిని యజమానులు అవకాశంగా తీసుకొని, యూనియన్‌ను విచ్ఛిన్నంచేయడానికిప్రయత్నించవచ్చు. వారిచేతులలో కీలుబొమ్మగావుండే మరియొక యూనియన్‌ను స్థాపించవచ్చు.

(5) కుల మత యూనియన్నను గుర్తించక పోవటం బాగానేవున్నది. కాని, దీనితోబాటు 'జాతి, (Race) వివక్షనకూడపాటించరాదని వుండాలి.

(6) కార్మికులకు ప్రాతినిధ్యం వహించగల యూనియన్ ఎలాంటిదో బిల్లు నిర్వచించలేదు. రాష్ట్ర ప్రభుత్వాల యిష్టానుసారం నిర్వచించటానికి అవకాశమిచ్చింది. కనుక యీషరతుయొక్క నిర్వచనం విశాలం చెయ్యాలి. సాధ్యమైనంత వరకు సభ్యత్వపు సంఖ్యను ఆధారంగా తీసుకోకుండా, ప్రస్తుతం పనిచేసే సంఘాలన్నింటికి బిల్లువర్తించేటట్లు వుండాలి. లేదా ఫ్యాక్టరీలలో నూటికి 10 మంది చొప్పున సభ్యత్వంవుంటే, అట్టి సంఘాన్ని "ప్రాతినిధ్యం వహించగల్గిన సంఘం"గా పరిగణించాలి. రాష్ట్రీయంగా సభ్యులనుచేర్చే సంఘాలను నూటికి 5 సభ్యత్వంవుంటే "ప్రాతినిధ్యం వహించగల గల్గిన సంఘం" గా పరిగణించాలి.

(7) ఇకముందు విధించబోయే యితర నిబంధనలుకూడా యూనియన్ నెరవేర్చాలి అనడం వల్ల యూనియన్నుపై ప్రభుత్వపు ప్రాబల్యం అధికమగుతుంది. కాబట్టి యీ షరతును తొలగించాలి.

(8) చట్టవ్యతిరేకమైనసమ్మెలను ప్రోత్సహించినా, యుద్ధనిర్వహణకు వ్యతిరేకంగా ప్రచారం చేసినా, యూనియన్ సభ్యులలో యవరైనా చట్టవిరుద్ధమైన సమ్మెలోపాల్గొన్నప్పటికీ, యూనియన్ రికగ్నిషన్ రద్దు చేయబడుతుంది. ఎట్టిసమ్మెలు చట్టవిరుద్ధమో నిర్వచించకుండా యీ షరతును విధించడంవల్ల స్థానికాధికారులు తమ యిష్టం వచ్చినట్లు ప్రతి సమ్మెను చట్టవిరుద్ధమైన సమ్మెగానే ప్రకటించటానికి అవకాశం వుంది. ఇక యుద్ధనిర్వహణ విషయం: నేటి ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో ప్రజాపక్షం జయించి ఫాసిజం నాశనం గావడానికి ప్రపంచ మంతటా కార్మికవర్గం నడుముబిగించి పనిచేస్తున్నది. మన దేశంలో కూడ అనేక పరిశ్రమలలో కార్మికులు అధికోత్పత్తిని తమ దేశభక్తియుతమైన కర్తవ్యంగా యెంచి పనిచేస్తున్నారు. ఐతే యుద్ధాన్ని సాకుగా తీసుకొని కార్మికవర్గ హక్కులను భంగపరచుటకు కార్మికవర్గం సమ్మతించదు. తమ రాజకీయ విధానాన్ని ప్రభుత్వంగాని, తదితరులు గాని, శాసించజాలరు. యుద్ధప్రచారానికి, రికగ్నిషన్‌కు ప్రభుత్వం ముడిపెట్టుట అన్యాయం. రికగ్నిషన్ అనే ఎరవేసి కార్మికుల సమ్మెహక్కును గుంజుకో జూస్తున్నారు. కాబట్టి కార్మికులు యీ షరతును యెన్నటికీ అంగీకరించజాలరు.

యూనియన్ సభ్యుల విశ్వాసాన్నిగోల్పోతేతప్ప, రికగ్నిషన్‌ను యేపరిస్థితిలోను రద్దుచేయరాదు.

9. కేంద్రప్రభుత్వపు ఆజమాయిషీలో వుండే పరిశ్రమలకు ప్రభుత్వపు అనుమతిపై తప్ప యీచట్టం వర్తించదని బిల్లులోవుంది. ప్రభుత్వమే స్వయంగా ఆచరణలోపెట్టలేని షరతులను యితర యజమానులకు యెలా వర్తింప చేయగల్గుతుంది? ప్రభుత్వఆజమాయిషీ క్రింద వున్న పరిశ్రమలన్నీ నేటి యుద్ధంలో చాలా ప్రధానపాత్ర వహిస్తున్నాయి. వీటిల్లో పనిచేసే అసంఖ్యాకులైన కార్మికులను కార్మికోద్యమంలో సమీకరించి, ఉత్సాహపరచడంపోలు. వారిని కార్మికోద్యమమునుండి దూరంచేయడం దేశరక్షణకు ఉంటుపరచడమే అవుతుంది. అధికోత్పత్తికై కార్మికుల చొరవను భగ్నపరుస్తుంది. అందువల్ల బిల్లులో యీషరతు వుండకూడదు.

### సూచనలు

రికగ్నైజు చేయబడిన ట్రేడుయూనియన్నుకు యీక్రింది సౌకర్యాలు వుండేటట్లు బిల్లును యీ క్రిందివిధంగా సవరించాలని అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సూచిస్తూంది.

ఫ్యాక్టరీయేరియాలలో యూనియన్ సమావేశాలు జరుపుకోడానికి హక్కువుండాలి. కార్మికులు పనిచేయని సమయంలో వారివద్ద చందాలు వసూలుచేసుకోడానికి యూనియన్ ప్రతినిధులకు అవకాశం వుండాలి. వారు పనిచేసే ప్రదేశాన్ని పరిశీలించేహక్కు కూడ వుండాలి. గనులు, తోటలు (Plantations) వున్న ప్రాంతాలలో యూనియన్ ఆఫీసును యేర్పరచుకునే అవకాశం వుండాలి. యజమానుల ఆవరణలలో కార్మికుల నివాసస్థలములు వున్నయెడల, యూనియన్ ప్రతినిధులు అక్కడకుపోయే అవకాశాలుండాలి. యూనియన్‌సభ్యులు కార్యనిర్వాహకవర్గ సమావేశాలకు, యితర యూనియన్‌సభలకు వెళ్లేటందుకు, యజమాని శలవుయివ్వాలి. ట్రేడుయూనియన్ కార్యకలాపంలో పాల్గొన్నందుకు కార్మికులపై యజమాని చర్య తీసుకోకూడదు. యజమాని రికగ్నైజుడు యూనియనులలో కార్మికులు చేరకుండా నిరుత్సాహపరచరాదు. తన కిష్టమైన మరొక యూనియన్‌లో చేరమని ప్రోత్సహించినా నిర్బంధించినా, అట్టి యజమానిపై ప్రభుత్వం చర్య తీసుకోవాలి.

ఈ బిల్లు కార్మికవర్గానికి వుపయోగకరంగా వుండాలంటే, పై సవరణలను అంగీకరించాలి. అంగీకరించకపోతే, యిది కార్మికవర్గానికి హానికరంగా కూడ పరిణమించవచ్చు.

# బెంగాల్, సోవియట్ మిత్రమండలి ద్వితీయ మహాసభ

"చైనాతో, టర్కీతో, ఇరాన్‌తో, ఆఫ్గనిస్థాన్‌తోగల సోవియటు చారిత్రక స్నేహాన్ని మనం మరచిపోలేం. ఒకప్రక్క యూరోపియన్ రాజ్యాలు తమ నాగరికతనుగురించి విర్రవీగుతూ, మరొకవైపున తుచ్ఛంగా తమ సామ్రాజ్యాన్ని, దోపిడీని అనియాయకూడా వ్యాపింపజేశాయి. ఆస్ట్రేలియాలో వారి సంపర్కం మూలంగా అక్కడి ప్రాచీన వాసులు అనాథులై అంతరించిపోయారు. ఆఫ్రికా వాసులను వారి దేశంలోనే వారికి హక్కు లేకుండా, క్రూరంగా మోసగించారు. ఇట్టి పరిస్థితులలో సోవియటు ప్రభుత్వంలో అధికసంఖ్యాకులయిన రష్యన్ ప్రజలు, ఇదివరకు పీడితులయినట్టియు - వెనుకబడినట్టియు — ఇతర సోవియటు ప్రజలకు తాము పొందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్పారు; ఇతరజాతుల ప్రజల్ని సాంకేతికపరిజ్ఞానంలో తమతోపాటు సమాన స్థితికి తీసుకొచ్చారు. దీని ఫలితం ఏమిటి? సోవియటు జాతీయ పాలసీ యొక్క ఆశయం మానవ విజ్ఞానాన్ని పెంపొందింపజేయడం, ఆలాంటివిజ్ఞానయుతులైన మానవులు సాధించిన సౌఖ్యాన్ని, అధికారసంపదను సోవియటు ప్రజలు యావన్మందీ ఈనాడు అనుభవిస్తున్నారు. ఒకప్పుడు ఊరూరతిరిగేజాతుల ప్రజలు ఈనాడు ఇంజనీర్లుగాను, శాస్త్రీయ వ్యవసాయ నిపుణులుగాను, సోవియటు వీరులుగాను, తయారయ్యారు. సోవియటు స్త్రీలు దాస్యం నుండి తప్పించబడ్డారు. శతాబ్దాలుగా నిద్రితమైన నిర్మాణాత్మక శక్తి, నేడు బ్రహ్మాండంగా విజృంభించింది.

"మిత్రుల—శత్రుల పరీక్షకు గూడ నిలిచి, 'జాతుల' సమస్యా పరిష్కారంలో సోవియటు బ్రహ్మాండమైన విజయం పొందింది, ఇదిచూచి, ప్రాచ్యదేశాలన్నీ స్వాతంత్ర్యయుద్ధంలో సోవియటుయూనియన్‌ను నాయకమణిగా చూడసాగాయి. రెడ్‌ఆర్మీకి సోవియట్ ప్రజలకు విజయం కల్గాలని కోరుతూ (మూడేండ్లక్రితం కూడా ఇలాగే కోరాం) మాహృదయ పూర్వక అభివందనాలను, స్నేహభావాన్ని ఐక్యతను తెలియజేస్తున్నాం."

అంటూ పలువురు బెంగాల్ ప్రముఖులు ఒక ప్రణాళికలో ప్రకటించారు.

బెంగాల్ రాష్ట్రంలోని సోవియట్ మిత్రమండలియొక్క ద్వితీయ మహాసభ, కలకత్తాలో ఏప్రిల్ 21 నుండి 23 వరకు జరిగింది. ఆసందర్భంలో పై ప్రణాళికను అంగీకరించుతూ 200 మంది నాయకులు సంతకాలు చేశారు.

దాదాపు మూడేండ్లక్రిందట, బెంగాల్ దేశభక్తులు నాయకత్వం వహించి, సోవియట్ మిత్రమండలిని స్థాపించారు. మహాకవి రవీంద్రనాథటాగూర్ ఆశీర్వాదంతో, అప్పుడది ప్రారంభించబడింది.

ఈ సంవత్సరం, కలకత్తాలోని దేశభక్త ప్రముఖులెందరో పాల్గొనడమేగాక (ప్రణాళికపై సంతకంచేసిన వారి పేర్లను క్రింద చూడండి) బెంగాల్‌లో దాదాపు ప్రతిజిల్లా నుండి రాజకీయ వర్కర్లు, రచయితలు, కళావేత్తలు, సైంటిస్టులు, పత్రికా విలేఖరులు, స్పోర్ట్సుమెన్ (ఆటలలో నిపుణులు) ఎంతో మందిమహాసభకువచ్చారు. సుప్రసిద్ధకాంగ్రెసు శ్రీ నెల్లీసేన్ గుప్తసతి కలకత్తా యూనివర్సిటీ భవనంలో మహాసభను ప్రారంభించింది. సోవియట్ యూనియన్‌లో స్త్రీలు ఎలా సంపూర్ణంగా దాస్యవిముక్తి చెందారో ఆమె తెలియజేసింది.

టాగూర్ మేనకోడలు శ్రీమతి ఇందిరాదేవి చౌదురాణి, (ఈమెకూడ సుప్రసిద్ధ రచయిత) 'ప్రజలకు సేవ చేయుట అనే కొత్తమతాన్ని' సోవియటు అవలంబించిందని చెప్పింది.

జె. సి. గుప్త. (కాంగ్రెస్ యం.యల్.ఎ.) మాట్లాడుతూ, నాజీలను ప్రతిఘటించుటలో సోవియటు చూపిన అద్భుతసాహసాలను ప్రశంసించారు.

ప్రొఫెసర్ కె. పి. చటోపాధ్యాయ (కాంగ్రెసువాది, మానవపరిణామశాస్త్రజ్ఞుడు) ప్రసంగించుతూ, సోవియటు విధానమందలి ప్రజాస్వామ్యము - స్వాతంత్ర్యవాంఛ మన జాతీయోద్యమంలో కూడ ప్రతిబింబించాయని చెప్పారు.

బెంగాల్‌రాష్ట్ర ముస్లింలీగ్ కార్యదర్శి మౌల్వీ అబుల్ హాషీమ్ ఇలా అన్నారు. "స్వయంనిర్ణయహక్కును ప్రాతిపదికగా చేసుకొని సోవియటు ప్రజలు నిర్మించుకొన్న ఐక్యతలోనే, వారి బలంఅంతావుంది. ప్రస్తుత పరిస్థితులలో మనం ఆ గుణపాఠాన్ని మన దేశంలో కూడా నేర్చుకోవాలి."

సుప్రసిద్ధ బెంగాలు నవలా రచయిత శ్రీయుత తారాశంకరబెనర్జీ, సోవియటు ప్రజలిచ్చిన స్వేచ్ఛాసందేశాన్ని ముందుకు గొనిపోవాలని ఉత్తేజకరంగా ఉపన్యసించారు.

వివిధజిల్లాలనుండి వచ్చిన ప్రతినిధుల రిపోర్టులనుబట్టి, సోవియటు యూనియను సాధించిన విజయాలను తెలిసికోవాలనే అభిరుచి మనప్రజలలో ఎంతో వృద్ధిచెందిందని తెలుస్తుంది. సోవియటు దేశాన్ని గురించి, సోవియటు ప్రజలను గురించి తెలిసికోవాలనే కాంక్ష ప్రజలలో నమ్మశక్యంగానట్లు ఎక్కువయింది. సోవియట్ యూనియన్ గురించి ఇంకా విశేషంగా భోగట్టాగావాలని అనేకమంది ప్రతినిధులు కోరారు. ఇది, సోవియట్ మిత్రమండలి పలుకుబడిని తెలియజేస్తోంది. అంతేగాదు, ఇంకా విరివిగా సోవియటు మిత్రమండలి శాఖలు వ్యాపించాలనికూడా తెలియజేస్తోంది.

మహాసభతోపాటు, సోవియట్ చిత్రప్రదర్శనశాల ఒకటి తెరువబడింది. ఇందులో సోవియటు ప్రజల జీవితాన్ని తెలియబరిచే చిత్రాలు, పోస్టర్లు ఉంచారు. మనదేశ సంస్కృతిని అభివృద్ధి చేయడానికిగాను విదేశాలతో సంబంధంపెట్టుకొని పనిచేసే ఒక బెంగాల్ సంస్థ చిత్రాల నన్నిటిని సప్లయి చేసింది. ఈ చిత్రప్రదర్శన శాలను సుప్రసిద్ధ చిత్రకారుడు జైమినీ రాయ్ ప్రారంభించారు. ఆయన సోవియట్‌లోని చిత్రకారులు ప్రజాజీవితంలో, ప్రజా ఆశయాలలో, ఎలా లీనమైఉంటారో తెలియజేశారు.

పైన ప్రకటించిన ప్రణాళికపై సంతకాలు చేసిన వివిధ ప్రముఖులను ఈక్రింద తెలియజేస్తున్నాం.

రాజకీయ నాయకులలో ఈ క్రింది వారున్నారు. నెల్లీ సేన్‌గుప్తసతి, (యం.,యల్.ఎ.) జె. సి. గుప్త. (యం. యల్. ఎ.) అరుణ్ కె. చందా (యం. యల్. ఏ., అస్సాం అసెంబ్లీలో కాంగ్రెసుపార్టీకి డిప్యూటీలీడర్). ఖాన్ సాహెబ్ నురుల్ అమీన్ (యం.యల్.సి., బెంగాల్ రాష్ట్రముస్లింలీగ్ ఉపాధ్యక్షుడు.) మౌల్వీ అబుల్ హాషేమ్ (యం.యల్.ఎ., బెంగాల్‌రాష్ట్ర ముస్లింలీగు కార్యదర్శి.) నవాబ్‌జాదా హసాన్ అలిచౌదరి (యం. యల్.ఏ., క్రిషక్ ప్రజాపార్టీ) మృణాళిసీ కాంతిబాసు, బెంగాల్‌రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు.) హెచ్. సి. నాస్కార్ (యం. యల్. ఎ. కలకత్తామాజీ మేయరు.) డాక్టరు ఆర్. అహమ్మద్, ప్రతుల్ భట్టాచార్య (అ. భా. కాం. కమిటీ మాజీ సభ్యులు.) వీరుగాక కమ్యూనిస్టుపార్టీ, కిసాన్ సభ, విద్యార్థిసంఘం, మహిళాఆత్మరక్షసమితి మొదలగుసంస్థల ప్రతినిధులెందరోసంతకాలు చేశారు. ఎందరో యూనివర్సిటీ అధ్యాపకులు, జర్నలిస్టులు, కళావేత్తలు, స్పోర్ట్సుమెన్ కూడా సంతకాలు చేశారు.

# నవయుగ నిర్మాత

బొమ్మరిళ్ళతో ప్రొద్దుపుచ్చి మారాముతో
తల్లివొడి వీడనీ - తనయలకు పెండ్లిండ్ల?
ముక్కుపచ్చలారని మొగబిడ్డలకు పెండ్లి
వద్దనీ చెప్పావు కందుకూరీ! బల్ల - గ్రుద్ది వాదించావు ఓ కందుకూరీ:
స్త్రీవిద్య కూడదను - చెడు నుడులు మరియునూ
స్త్రీ తిరిగి చెడునన్న - చెడునీతులను పెట్టి
స్త్రీకి స్వేచ్ఛయు, వృద్ధి - స్వాతంత్ర్య మొద్దనే
శాస్త్రాలకాల్దన్ని కందుకూరీ! పట్టి - ఛాందసంబన్నావు ఓ కందుకూరీ!
అభము శుభమెరుగనీ - ఆడపిల్లలు, విధవ
లైనచో కర్మంచు - అట్టులే బ్రతుకుడని
శాసించు ఛాందసుల - శాస్త్రాల నరికట్టి
పునర్వివాహాల కందుకూరీ! పోరి - చేయించితివి, కొట్టి నీ విజయభేరీ!
పండ్లూడి శారీర - పటిమతగ్గిన కటికి
ముసలి తాతలకు తమ - ముద్దు బిడ్డలనిచ్చి
ఆస్తులన్ కల్గినా అల్లుండ్రటని కులుక
తగని దాంపత్యమని కందుకూరీ! పెద్ద - ద్రోహమని చెప్పావు ఓ కందుకూరీ!
దయ్యాల భూతాల తంతులన్నీ దెల్పి
గృహవాసమున కద్దు - గోను మూఢనమ్మకాల్
సాంఘిక దురాచార - సాంప్రదాయాలంటి
ఖండించి గెల్చితివి కందుకూరీ! నీవు - ఘనకీర్తి శేషుడవు కందుకూరీ!
చిందులే ద్రొక్కారు - నిందలే గ్రక్కారు
బందిపోట్లైందటో - సందుల్లో నక్కారు
కులపు వెలిబంధాలతో - గోలగోల్జేశారు
వొంటివాడవు నాడు కందుకూరీ! నేడు - కంటిపాపవు నీవె కందుకూరీ!
'కళకోసరంబె కళ - గాని ప్రజలందుకొన
కాదం'చు, కవి తనదు - కలము గబగబ ముందు
కున్ బోవ, నిష్ఫలం - బని నొక్కిచెప్పావు
నినుబోలు వారెవరు కందుకూరీ! నీవె నవయుగపు నిర్మాత కందుకూరీ!

— కోసూరి పున్నయ్య

# ప్రపంచ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు విరాళాలు

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తరపున ప్రతినిధులు యన్. యం. జోషీ, డాంగే, కాలప్పగార్ల ప్రయాణ ఖర్చులకు తోడ్పడవలసిందని అ. భా. ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు కార్మికులందరికి పిలుపు ఇచ్చింది. ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌వర్కర్ల యూనియన్ బెజవాడ బ్రాంచి తరపున "ప్రజాశక్తి" ప్రెస్‌వర్కర్లు రు 65/ వసూలు చేశారు. ఈ మొత్తమును అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసుకు పంపుటకు తీర్మానించారు.



# మొదట జిన్నాను కలుసుకోవాలి తరువాత వేవెల్ పని చూద్దాం

గాంధీజీ విడుదలపై సర్వత్రఉప్పొంగిన సంతోషం కాంగ్రెసు వర్గాల్లో క్రమంగా ఉపేక్షాభావానికి దారితీస్తుంది. మహాత్ముడే ఇక సారథ్యం వహించి, అంతా చక్కబెడతాడనే భావం అందరిలోను నాటుకుంటూంది.

ప్రభుత్వం తక్కిన నాయకులనుకూడ విడుదలచేసి పరిష్కారానికి అవకాశం కలిగిస్తుందని కాంగ్రెసు పత్రికలు ఆశిస్తున్నాయి. మహాత్ముని మొట్టమొదటి కార్యక్రమం వేవెల్‌ని కలుసుకోవడమేనని ఖచ్చితంగా చెబుతున్నాయి. కాంగ్రెసు - లీగ్ ఒడంబడికవల్ల లాభంఉంటుందనిమాత్రం అంటున్నాయి. మొదటి ప్రాధాన్యత వేవెల్‌తో రాయబారాలకు, రెండోస్థానం జిన్నాతో ఒడంబడికకు, ఇస్తున్నాయి. ఈవైఖరివల్ల ఆశాభంగం తప్పదు.

రాజకీయ ప్రతిష్టంభన తెచ్చిపెట్టింది, బ్రిటిష్‌పాలకులు, పరిష్కారంకోసం అందోళనపడుతూవున్నది, అన్ని పార్టీలలోని దేశభక్తులు. అలాంటిది, వేవెల్ గాంధిజీకోసం కాచుక్కూర్చున్నాడనుకోవడం, గత రెండు సంవత్సరాల విషాదగాథను మరచిపోవడమన్నమాట. మొట్టమొదటగా వేవెల్ దగ్గరకు వెళ్ళడం అంటే, లిన్‌లిత్గో ఏసమాధానం చెప్పాడో ఆ సమాధానమ్నే, బహుశా అంతకన్నా మెత్తనిమాటల్లో, తిరిగి పొందడమన్నమాట.

గాంధీజీ వేవెల్ దగ్గరకు వెళితే జరిగేదేమిటి? రాజకీయ సమస్యా పరిష్కారానికి అంతరాయంగావున్న వైషమ్యాలను చూచి తానెంత విచారిస్తున్నాడో వేవెల్ చెబుతాడు. జిన్నా వెళితే - భారతదేశ ఐక్యతను నిర్మించడానికి తన పూర్వులెంతగా పాటుపడ్డారో వేవెల్ వివరిస్తాడు. అంత కష్టపడి నిర్మించిన ఐక్యతను 'పాకిస్థాను' ద్వారా భగ్నం చేయడమేనా? అందులోనూ ఈ యుద్ధం రోజుల్లోనా? అని గుండెకొట్టుకుంటాడు.

ఇక వేవెల్ దిగివచ్చేలా చేయడం ఎలా? గాంధీజీ, జిన్నాలు, పరస్పరం అంగీకారం కుదుర్చుకొని, చేయిచేయి కలిపి, వేవెల్‌ని చుట్టుముట్టడం ఒక్కటే ఇందుకు మార్గం.

కాబట్టి గాంధీజీ ముందుగా జిన్నాను కలుసుకోవాలి. కాంగ్రెసు తీర్మానాల్లో ధ్వనిస్తూన్న స్వయంనిర్ణయసూత్ర అంగీకారాన్ని స్పష్టంచేయాలి. లీగు దేశభక్తులకు తద్వారా సంతృప్తి కలిగించాలి. ప్రజలకు ఆహారం అందివ్వడానికి; ఇతర నాయకులను, ఫాసిస్టు వ్యతిరేక దేశభక్తులను విడిపించుకోడానికి; దేశ స్వాతంత్ర్యంకోసం, మానవజాతి క్షేమంకోసం, మిత్రరాజ్యాలతో భుజంభుజం కలిపి జపాను శత్రువును జయప్రదంగా ఎదుర్కోవడంకోసం తాత్కాలిక జాతీయప్రభుత్వ స్థాపనకు, కాంగ్రెసు - లీగు ఐక్యతను నిర్మించాలి.

ముందుగా వేవెల్‌వద్దకు పోవడమంటే, పరాభవాన్ని, పరాజయాన్ని, కోరి తెచ్చుకోవడమన్నమాట. జిన్నాదగ్గరకు ముందుగా వెళ్ళడమంటే, అన్నదమ్ములతో చేతులు కలిపి, అధికతరమైన బలాన్ని సంపాదించి, అజేయులం కావడమన్నమాట.

[పీపుల్స్‌వార్
సంపాదకీయం, మే 21, 1944]

(2 వపేజీ తరువాయి) తూన్న నిర్మాణోద్యమాలకు దెబ్బ.

అంతేకాదు, ఇంత కోలాహలంగా పని సాగుతూన్నకాలవ ఇవతలి గట్టుపైననేఉంది మొన్న రైతుమహాసభ జరిగిన స్థలం. అక్కడి తాటిచెట్టుమీద అప్పటి ఎర్రజెండా ఒకటి ఇంకా సగర్వంగా ఎగురుతూనేవుంది. ఆమహాసభ సాంప్రదాయానికికొరతరానిస్తారా దాన్ని నిర్వహించిన ఈ రైతు, కూలీలు? ఒక్కమా రటుచూస్తేచాలు - అలసిపోతున్న అవయవాల్లో నూతన శక్తి ఉబుకుతోందనిపిస్తుంది.

## పిన్నలు - పెద్దలు

కాలవలో యనమలకుదురు లాకువైపు నడక ప్రారంభించాను. వడ్డికప్పర, వ్యవసాయకూలీ, పార్టీసభ్యుల, ముఠాలు ఇటు అటు చురుకుగా పనిచేస్తున్నాయి.

పనిచేస్తున్న పార్టీసభ్యుల్లో అన్నితరగతుల రైతులు, విద్యార్థులు, కార్మికులు, వృద్ధులు ఉన్నారు. భీమవరపు కృష్ణారెడ్డి (ప్రొద్దుటూరు); గన్నే సత్యం (వల్లూరు), గార్లు చెరి వందయకరాల ఆసామీలు. పారతవ్వి తట్టలెత్తుతున్నారు. ఆ పక్కనే పనిచేస్తున్న కూలీలు ఈ చిత్రాన్ని వింతగా చూచారు. మరికొంతదూరం ముందుకు సాగాను. నవనవలాడుతూన్న కొందరు విద్యార్థులు తట్టలు మోస్తున్నారు, పారలతో త్రవ్వుతున్నారు. వారికి ఉషారిస్తూ ఆ ప్రక్కనే ఒక వృద్ధమూర్తి పలుగువేస్తున్నాడు. ముఖాన అలసట చిహ్నాలున్నాయి. కాని పెదవుల మీద చిరునవ్వులు చిందులు తొక్కుతున్నాయి. ఎవరని అడిగాను. గుత్తికొండ అచ్చయ్యగారు, 60 ఏళ్ళకు పైబడిన దేశసేవకుడు. కాంగ్రెసు ఉద్యమంలో ఎంతో త్యాగం చేశాడు. ఈనాడు ఎర్రజండా నీడక్రింద ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. పిలుపు విన్నదే తడవుగా చేతిలోఉన్న స్వంతపనుల నన్నిటిని మూలబెట్టి కాలవపనికి వచ్చాడు. పని పట్టుదలతోను, ఆ చిరునవ్వుతోను, తన చుట్టూఉన్న యువకబృందాన్ని అనుక్షణం ప్రోత్సహిస్తున్నాడు. వారికి నా హృదయంలోనే అభినందనలందజేసి ముందుకు సాగాను.

మరోచోట, తలపాగ - పండుగడ్డం, దట్టిబిగించిన పంచెకట్టు - చేతిలో పార - ఒక తాత నవ్వుతూ నావైపుచూచాడు. "వీరేనండి మా లెనిన్" - అంటూ పక్కనున్న యువకులు ఎంతో ఆప్యాయంగా పరిచయంచేశారు. 60 ఏళ్ళపైనుంటాయి జిల్లెల వెంకయ్యగారు (దావాజిగూడెం). వారిముఖంలోని పని పట్టుదలనుచూచి, ఎక్కువసేపు మాట్లాడుతూ నిల్చోలేకపోయాను. ప్రతినిమిషానికి కొంత పని లెక్కకు రావాలి. శాల్యూట్ చేసి, ముందుకు సాగాను.

## కొత్త అనుభవం

ఎక్కడచూచినా ఇలాంటి దృశ్యాలే. అలవాటులేని ఆగట్టు పని క్రమక్రమంగా, దీక్ష కొద్దీ, అలవాటు పరచుకొని, అదే వృత్తిగాగల కూలీలతో కలిసివస్తున్న విద్యార్థులు, మేధావులు, ప్రక్కనున్న ఇతర కూలీముఠాలకు ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగిస్తున్నారు.

నెలపురోజు కావడంవల్ల అచ్చుపనివారు, ఇతర కార్మికులువచ్చి, ఎవరికీ తీసిపోని ఉత్సాహంతో పనిచేస్తున్నారు కార్మిక-కర్షక ఐక్యతను వారు నిరూపించారు. వాల్‌టెక్నీషియన్ శిక్షణ పొందుతూన్న యువకులు తమ నెలపురోజులను ఈపనికి వినియోగిస్తున్నారు. బాలసంఘంకూడా 'ఉడుతాసాయం' కొనసాగిస్తూంది.

ఇలాంటివారితో భుజంభుజం కలిపి పనిచేయడం కూలీలకొక కొత్తఅనుభవం. వారికే కాదు, ఆ సంగతి విన్నవారందరికీ అదొక వింత. 13 వ తేదీనాడు కామ్రేడ్స్ సుందరయ్య, వాసుదేవరావు, చంద్రశేఖరరావు, గోపాలరావు మొదలైన పార్టీ నాయకులంతా తలలకు గడ్డిచుట్టలు చుట్టి, తట్టా - పారాపట్టి పనిచేసినప్పుడు చూచినవారి సంగతి వేరే చెప్పనక్కరలేదు.

## ఇరుగు పొరుగువారి తోడ్పాటు

ప్రముఖ రాజకీయపక్ష నాయకులు ఇలా తట్టా పారా పట్టి, కూలీలతోపాటు పనిచేయడం కని విని ఎరుగని విషయం. పట్టణ మధ్యతరగతివారు ఈవిషయాన్ని గురించి వింతగా చెప్పుకొంటున్నారు. కుల, వర్గ, విచక్షణలేకుండా, విజ్ఞానస్థాయిల తారతమ్యాలాలోచించకుండా, అంతా కలిసి పనిచేయడం చుట్టుప్రక్కల రైతుకుటుంబాల్లో ఎంతో సంచలనం కలిగించింది.

"కమ్యూనిస్టులంటే ఏమిటోఅనుకున్నాం. వారి కార్యదీక్ష నేనాడు కళ్ళారచూచాం. బాగుందినాయనా, మీపని," అని ఆశీర్వదించాడొకరైతుపెద్ద. కాలవకి ఇటూ అటూ ఉన్న పటమట, యనమలకుదురునుంచి రైతులు దళాలుగవచ్చి పనిచేస్తామని వాగ్దానంచేశారు, పటమటనుంచి కొంతనుంది రైతుస్త్రీలు వంటశాలలో పనులుచేయడానికి తమంతటతాము ముందుకు వచ్చారు. వెలగపూడి రత్తయ్యగారు గుమ్మడికాయలు పంపారు. యనమలకుదురులోని కొందరు యువకులు ఎవరూ పిలవకుండానే వచ్చి పనిచేశారు. పనిపూర్తి చేసుకొని స్నానానికని ఎటో బయలుదేరిన రైతుకూలీ వర్కర్లనావి — "మా ఇళ్ళల్లోనే నూతులున్నాయి — స్నానం చేయండ"ని ఆహ్వానించారు యనమలకుదురు రైతులు. నీళ్ళు చేదుకోబోతే — "ఇంతసేపూ చేతులు పుళ్లుచేసుకొని పనిచేశారు - మీరెందుకు చేదడం" - అని తామే చేది నీళ్ళుపోశారు.

ఇలా నడుంవంచి పనిచేస్తున్న వీరందరూ తమ బిడ్డలు, అలా చెమటోడ్చడమంతా, తమ పంటలభివృద్ధి కోసం. కరువు రాక్షసినుంచి దేశాన్ని కాపాడ్డంకోసం. అలాంటి తమ బిడ్డలపట్ల ఆ రైతుకుటుంబాలు సానుభూతి చూపడం సహజమేకదా! ఈ కార్యదీక్ష ముందు, ఈ సానుభూతి చలువలో రాజకీయకక్షలు, ఇతర విభేదాలు అంతరించిపోతాయి. నిర్మాణ కార్యక్రమంపట్ల ఉత్సాహం, ప్రజా సేవా తత్పరతలు వికసిస్తాయి. తప్పదు.

## అధికార వర్గాల్లో —

"నా జన్మలో ఇలాంటిది చూడలేద"న్నాడొక ఓవర్సీర్. ప్రజలతో సంబంధం లేకుండా, వారి సానుభూతితో పనిలేకుండా ఉండే ప్రభుత్వపు అధికారవర్గానికిది కొత్తకావడంలో ఆశ్చర్యమేముంది? తమవల్ల కాదనుకొన్న పని తమ కళ్ళఎదుటే పూర్తి అవుతూంటే, ఆశ్చర్యచకితులయారు. అధికార వర్గంవారు. ప్రజాసంస్థలశక్తిని కార్యరూపంలో చూచారు.

## సమిష్టి జీవనం

అధికారవర్గానికి, ప్రజాసంస్థలకు, తారతమ్యం, పనివాళ్ళచేత పని చేయించడంలోనేకాదు, పని సాగుతూన్నంతకాలం పనివారి నిత్యజీవనాన్ని గురించి శ్రద్ధ తీసుకోవడంలో కూడా ప్రజాసంస్థలు అధికారవర్గాలకు పాఠాలునేర్పుతున్నాయి. పనివారికి కంట్రోలు ధరలకు బియ్యం, మొదలైన ఆహార పదార్థాలు సప్లయిచేసే ఏర్పాట్లు జరిగాయి. దెబ్బలు తగిలిన వారికి చికిత్స సౌకర్యాలనేర్పాటుచేశారు. అన్నిటిని మించినదేమంటే, పగలంతా పని చేసి అలసిపోయినవారికి సాయంత్రం కొంతసేపు వినోద కార్యక్రమం. కమ్యూనిస్టుపార్టీ, రైతుసంఘ, వైజ్ఞానికదళాలు ప్రతిరోజూ అక్కడక్కడ బుర్రకథలు చెబుతున్నాయి.

ఒకచోట బుర్రకథ వేశయింది. దళం వచ్చి డక్కి వాయించసాగింది. చుట్టుపక్కలఉన్న పుప్పర ముఠాలవారు తిర్లా, తిప్పలు తొందర తొందరగా తెముల్చుకొని వచ్చి చుట్టూ కూర్చోసాగారు. ఇది వారి జీవితంలోనే కొత్త అనుభవం. కష్టజీవుల చేత అంతా బండచాకిరీ చేయించుకొనేవారేగాని, వారి వినోదవికాసాలను గురించి ఆలోచించిన దెవరు? తమలాంటి కష్టజీవులు చైతన్యంపొంది, ప్రజాసంస్థల కింద సంఘటితమై, ఎంతలేసి ఘనకార్యాలు సాధించారో ఆ బుర్రకథలద్వారా తెలుసుకుంటున్నారు. అంతవరకు అజ్ఞానాంధకారంలోపడి కొట్టుకొంటున్న వారి భావాల్లో ఒక కొత్త వెలుగు పొడచూపింది. తమపట్లఇంతసుహృదయంతో ప్రవర్తిస్తున్న సంస్థల ప్రధానాశయాన్ని గ్రహించారు.

"ఆ బాబులు చెప్పే రాజ్యంలో పనిదొరకదనే బాధవుండదు. భోజనం లేదనేభయం ఉండదు. అందుకోసం పాటుపడుతున్నారు"- అన్నదొక వుప్పరస్త్రీ. ఆ రాజ్యానికి చిహ్నమయిన ఎర్రజెండాను చూచి ఉద్వేగంతో. "ఆ జెండా మన జెండా - కూలీలజెండా! ప్రాణంతోసమానంగా కాపాడుకోవాల"న్నాడొక వుప్పరమేస్త్రీ. తమచేత పనిచేయిస్తున్న ప్రజాసంస్థలకు, వాటి ఆశయానికి, ఈవిధంగా కృతజ్ఞతను వెల్లడించారు కష్టజీవులు.

## మరింత ఉత్సాహంతో-

ఈ విధంగాఉత్తేజితులైన ముఠాలు మరునాడు ఇంకా ఉత్సాహంతో,పట్టుదలతో పనిలో ప్రవేశిస్తున్నాయి.ముందురోజుఅనుభవంమీద, "పరవాలేదు - ఇంకా పని చేయగలమ"నే ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు, పార్టీ సభ్యులు, మొదలయిన వారు రంగంలోకి దిగుతున్నారు. నానాటికి పని కొత్త వుషారుతోఇంకా చురుకుగా సాగుతోంది. తెలుగురావుపాలెం (కృష్ణాజిల్లా) ముఠా మనిషికి ఆరుగజాలచొప్పున తవ్వి, తక్కిన ముఠాలను బోల్షివిక్ పోటీకి సవాల్ చేసింది. ఈ ముఠాలో ఇద్దరేపార్టీ సభ్యులు. మిగతా వారందరూ వ్యవసాయకూలీలు. గుంటూరుజిల్లా పార్టీదళం అగ్రతాంబూలం పొందాలనే పట్టుదలతో, పని సాగిస్తూంది. ఇతరదళాలు రోజురోజుకి ఎక్కువ పనిచేయాలనే దీక్షతో ఉరకలు తీస్తున్నాయి.

## గుణపాఠం

ప్రజలకు క్షేమంకూర్చగల కార్యక్రమాన్ని నిరంకుశ ప్రభుత్వ అధికారవర్గాలకన్నా ప్రజాసంస్థలే జయప్రదంగా కొనసాగించగలవని ఈఘటన నిరూపించగలదని (మిగతాది పేజీలో)

# అధికాహారోత్పత్తికి వివిధపార్టీల దేశభక్తులు కలిసి పనిచేస్తున్నారు

పశ్చిమగోదావరిజిల్లాలో కోడేరు బ్యాంకు కాలువ మరమ్మతు లేక, మెరక వేసింది. అందువల్ల 30 గ్రామాలకు నీటిసరఫరా సరిగా లేదు. ఈ సంవత్సరం కాలువ తవ్వబడక పోతే, 75,000 యకరాలకు నీరు సప్లయి కాక, 1,50,000 బస్తాలధాన్యం ప్రథమ పంట లోనే నష్టమవుతుంది.

అందువల్ల, తాలూకా రైతుసంఘం అధికాహారోత్పత్తిని అమలుజరిపి. ప్రజల్ని కరువునుండి కాపాడ్డానికి, కాల్వను మరమ్మతు చేయించి తీరాలని సంకల్పించింది. కరపత్రాలద్వారా, సభలద్వారా, 25 గ్రామాలలో ప్రచారం చేశాం. పెద్ద రైతుల్ని కూడా కలుసుకొని, చర్చించాం. తాలూకా యందలి కాంగ్రెసు వాదుల్ని కూడా కలుసుకున్నాం. దేశాన్ని కరువు బాధనుండి తప్పించడానికి అధికాహారోత్పత్తి ఎలా దేశభక్తి యుతమైన కర్తవ్యమో, తెలియజేశాం.

మా ప్రయత్నం ఫలించింది. 1920 నుండి కాంగ్రెసులో పనిచేస్తున్న శ్రీ గొడవర్తి సుబ్బన్నగారు, ఆచంట సత్యనారాయణ గారు, రైతు సంఘంతో కలిసి పనిచేయడాని కంగీకరించారు. వెంటనే కోడేరు బ్యాంకు కాల్వ రైతుల సభ 20-4-44 వ తేదీని ఆచంటలో ఏర్పాటుచేశాం. మాతోబాటు శ్రీ సుబ్బన్నగారు, సత్యనారాయణగారు, గ్రామాలలో తిరిగి ప్రచారం చేశారు. 10 గ్రామాల నుండి రైతుప్రతినిధులు హాజరయ్యారు. జస్టిస్ పార్టీవారు, కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులు సమావేశ చర్చలలో పాల్గొన్నారు. రైతు సంఘ ఆహ్వానంపై, సబ్ డివిజనల్ ఆఫీసరు కూడా హాజరయ్యారు.

ఈ యేడు కాల్వను తవ్వించి తీరాలని సభలో అంతా ఏకాభిప్రాయాన్ని వెల్లడించారు.

ఇందుకు జస్టిస్, కాంగ్రెసు, రైతుసంఘ ప్రతినిధులతో ఒక కార్యవర్గం ఎన్నుకోబడింది. ఈఐక్యతను అంతా ప్రశంసించారు. కామ్రేడ్ మృత్యుంజయుడు: "ప్రజల సౌకర్యం కొరకు అందరినీ ఐక్యపరచి, కలిసి పనిచేయడమే కమ్యూనిస్టుల కోరిక." అని ఉపన్యసించారు.

గొడవర్తి సుబ్బన్నగారు (కన్వీనరు) 29-4-44 వ తేదీని కాల్వ అంతటికీ, అనగా తవ్వవలసిన 13 మైళ్ళకు, టెండరు దాఖలుచేశారు. యూనిట్ రు. 13చొ॥ పెట్టారు. 13 మైళ్ళ పొడవును 5 భాగాలుగా విభజించారు. దాంట్లో 2 భాగాలకు ఇద్దరు కంట్రాక్టర్లు యూనిటు 1 కి రు. 14-8-0, రు. 15-0-0 లకు టెండర్లు పెట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రైతుసంఘశక్తిని శంకించి, 2 భాగాలు మాత్రమే రైతు సంఘానికిచ్చారు. ఒకభాగం ఎవరికీ యివ్వలేదు. మిగతా రెండు భాగాలు కంట్రాక్టర్లకిచ్చారు. అగ్రిమెంట్లు 3-5-44 వ తేదీని శాంక్షన్ అయ్యాయి.

రైతుసంఘవర్కర్లు కూలీలకొరకు గ్రామాలలో ప్రచారంచేశారు. కొన్ని గ్రామాలలో రైతుల్ని తమవెంట తీసుకెళ్ళి, కాల్వను తవ్వడంవల్ల కలిగే ఉపయోగాన్ని గురించి నచ్చజెప్పి, కూలీలకు రైతులద్వారా అడ్వాన్సు లిప్పించారు. పని 7 వ తేదీని ప్రారంభమయింది. ఇప్పటికి (17-5-44) 800 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఇంకా 1000 మంది వస్తారని ఆశిస్తున్నాం. 25 వ తేదీకి పని పూర్తి అవుతుంది.

ఈ కాలువ మరమ్మతువల్ల అన్ని గ్రామాలకు (30) యీ సంవత్సరం నీటి సరఫరా జరుగుతుంది. దాళవా పంటకుకూడా నీరు పుష్కలంగా లభిస్తుంది.

— పి. మృత్యుంజయుడు

# కానూరు, పెండ్యాల స్కీములు విరమింపబడలేదు

పశ్చిమ గోదావరిజిల్లాలో కానూరు, పెండ్యాల స్కీములు అమలు జరుపుటద్వారా 11,000 ఎకరాలు సాగులోనికివచ్చి 1,75,000 బస్తాల ధాన్యం పండించే అవకాశముంది. లోగడ రైతులు ఆందోళన చేయుటద్వారా ప్రభుత్వం స్పెషల్ ఎగ్జిక్యూటివు ఇంజనీయరును యేర్పరచింది. పరిశోధనలు పూర్తి అయిన తరువాత రైతులు, వ్యాపార పంటల పట్ల శ్రద్ధగలిగి యున్నారనే పొరబాటు అభిప్రాయముతో స్కీములను అకస్మికంగా ఆపినట్లు తెలిసింది. పి. డబ్ల్యు. డి. స్టాపును యెత్తివేసింది.

ఈస్కీమ్కును ఆపివేయదలచారని తెలియగానే, అన్ని గ్రామాల రైతులు స్కీములను ఆపివేయవద్దనీ, ఎంక్వయరీచేసి నిజ పరిస్థితులను తెలుసుకోవాలని, ప్రభుత్వము కోరినట్లు నజరానాలున్ను. నీటి తీరువాలున్ను చెల్లించుకుంటామనీ, ఆహార పంటలనే పండిస్తామనీ, టెలిగ్రాములద్వారాను, మహజర్ల ద్వారాను ప్రభుత్వమునకు తెలియపర్చారు. మే 1 వ తేదీన కానూరు, పెండ్యాల రైతుల మహాసభలో తీర్మానాలుచేసి ప్రభుత్వానికి పంపారు.

పై సభలో నిజ పరిస్థితులను ప్రభుత్వానికి తెలియజెప్పుటకుగాను ఒక రాయబార కమిటీని యెన్నుకున్నారు. కమిటీ సభ్యులు నండూరి ప్రసాదరావు (ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి), ఉద్దరాజు సూర్యరాజు (పశ్చిమగోదావరిజిల్లా రైతుసంఘాధ్యక్షుడు). శ్రీమత్కందాళం శఠగోపాచార్యులు, చేకూరి సుబ్బరాజుగారలు. ఉదకమండలములోనున్న ప్రభుత్వపు ఎడ్వయిజరు శొంఠి రామమూర్తి పంతులుగారిని పైకమిటీ 14వ తేదీన కలుసుకొని, 20 గ్రామాలలోని రైతులంతా కూడా ఆహారపంటలనే పండించుటకు సిద్ధముగా వున్నారనీ, ప్రభుత్వముకోరినట్లు నజరానాలు, నీటితీరువాలు యిచ్చుటకు సిద్ధముగా వున్నామని చెప్పగా, రామమూర్తిగారు స్కీములు యింకను విరమింపబడలేదని. ఆహారపంటలనే పండించుటకున్నూ. కాల్వత్రవ్వేభూములకు యివ్వవలసిన భూముల కిమ్మతులో అవసరముబట్టి కొంతమొత్తమును రైతులు భరించుటకు అంగీకరించెదరా? అను రెండువిషయములను విచారణ నిమిత్తం రివిన్యూ డిపార్టుమెంటువారికిపంపినామనిన్నీ, వారి సముజాయిషీ వచ్చినపిమ్మట స్కీములను అమలు పెట్టుటను గురించి పునరాలోచింపబడుననీ చెప్పినారు.

# ఈనాము రైతుల జిరాయితీ హక్కును కాపాడాలి

— కడియాల గోపాలరావు

1908 సంవత్సరపు ఎస్టేటు లాండు ఆక్టులో ఈనాములను ఎస్టేట్లుగా పరిగణించారు. దరిమిలాను 1936 లో ఇంకో ముఖ్యసవరణ చేయబడింది. దీనిప్రకారం, 3సంవత్సరముల లోపల ఈనాందార్లు తమ స్వంత కమతము లని రుజువుచేసుకోలేని భూములపై రైతు ఒక్క సంవత్సరం శిస్తును పరిహారంగా ఇస్తే, ఆ రైతుకు జిరాయితీ హక్కును కలుగజేయాలి. దీని ప్రకారం ఈనాం రైతులు జిరాయితీ హక్కును సంపాదించుకొన్నారు. కొన్ని గ్రామాలలో ఈనామదారులు రైతులకు జిరాయితీ పట్టాలనిచ్చారు. రైతులు డబ్బు ఖర్చుపెట్టి, భూములను బాగా అభివృద్ధిజేసికొన్నారు. కొన్ని భూములు ఒకరిద్దరు చేతులలోనుంచి మారినవికూడా.

కాని, ఇటీవల మద్రాసుహైకోర్టులో, ఒక గ్రామము ఈనాముగా గ్రాంటుచేయబడునాటికి మైనరు ఈనాములుగాని, పోరంబోకులుగాని ఉన్నయెడల అట్టి ఈనాము గ్రాంటులు మద్రాసు ఎస్టేట్సు లాండు ఆక్టు సెక్షను 3 క్లాజు (2) డి ప్రకారం ఎస్టేట్లు కావనియూ, ఖండ్రికలు నిండు ఈనాములు కావనియూ, తీర్పు ఇవ్వబడింది.

మైనరు ఈనాములు, పోరంబోకులు లేని గ్రామాలుండవనుట సర్వవిదితము. హిందూదేశములో దేవుళ్ళకు ఇచ్చిన ఈనాములు (దేవాలయములు) గాని, ధర్మమునకు ఈనాములు (ధర్మాదాయములు) గాని, నౌకరులకు ఇచ్చిన ఈనాములు (మంగలి, చాకలి, మొ॥) గాని లేకుండా ఏగ్రామము ఉండదు. 1934 ఎస్టేటు లాండు ఆక్టు సవరణ బిల్లులోకూడా ఏదో రకమైన పోరంబోకులు లేని గ్రామాలులేవని అంగీకరించబడ్డది. కాని ఈ హైకోర్టు తీర్పువల్ల ఏపోరంబోకులుగాని. మైనరు ఈనాములు గాని, ఈనాము గ్రాంటు సమయానికి ఉన్నట్లయితే ఆ ఈనాములు నిండు యీనాములు కావనుట అన్యాయము.

ఈతీర్పును ఆధారంగాచేసుకొని, ఇదివరకు జిరాయితీ హక్కును ఇచ్చిన గ్రామాలలో కూడా ఈనాముదార్లు రైతులపై వందలకొలది దావాలు తెస్తున్నారు. రెవిన్యూ కోర్టులలోనున్న దావాలను ఈతీర్పు ననుసరించి సివిలు కోర్టులకు ట్రాన్స్ఫరు చేయించు కొంటున్నారు. రైతు అన్యాయముగావ్యయప్రయాసలకు గురియగుచున్నాడు.

ఈ విషయమును గురించి ప్రభుత్వమునకు తెలియజేసి ఆక్టును సరియైన విధముగా సవరించునట్లు కోరడానికి వెళ్ళనున్న రాయబార వర్గమునకు ప్రభుత్వము, తాము 1908 ఎస్టేటు లాండు ఆక్టులోని సెక్షను 3 (2) (డి) ని సవరణ చేయబోతున్నామని తెలియపరిచారు. ప్రభుత్వము చేయబోవు సవరణ ఈ క్రింది విధముగా ఉండాలని కోరుచున్నాను.

(1) ఈనాము గ్రాంటుచేయబడు నాటికి మైనరు ఈనాములు, పోరంబోకులు ఉన్నప్పటికీ, ఈనాము గ్రాంటు నిండు ఈనామనీ, కాబట్టి అది ఎస్టేటు అనీ పరిగణించాలి.

(2) గ్రామములో ఒక భాగము (ఖండ్రికలు) ఈనాముగా ఇవ్వబడ్డప్పుడు, అట్టి ఖండ్రికలు కూడా ఈ ఆక్టుకు సంబంధించినంతవరకు ఎస్టేట్లుగానే పరిగణించబడాలి.

ఈపై విధముగా సవరణ వెంటనే తీసుకురానియెడల, ఆంధ్ర దేశములోని వేలాది ఈనామురైతులు అన్యాయముగాఅష్టకష్టాలకు లోనుగావలసి వస్తుంది. ఈ సవరణ కొరకై ఆంధ్రదేశములోని ఈనాము గ్రామాల రైతులందరూ, రైతు శ్రేయోభిలాషులు, గ్రామ, జిల్లా రైతుసంఘాలు తీవ్రఆందోళన చేయాలని కోరుతున్నాను.

# దొంగవ్యాపారస్తునికి తగిన శాస్తి

నూజివీడులో వంకదారు సుబ్రహ్మణ్యం అనే ఆసామి ప్రభుత్వంవద్దలైసెన్సు పొందిన ఇనుప వ్యాపారస్తుడు. క్రిందటి ఏప్రిల్ 23 వ తేదీని, పర్వతనేని వెంకట సుబ్బయ్యగారికి బండి పట్టాలు కంట్రోలు రేటుకు మించి మణుగు 1 కి రు 7-8-0 చొప్పున అమ్మి, పైకము తీసుకొంటూంటే, తాలూకా యువజనసంఘ ఆర్గనైజరు అక్కడికివెళ్ళి, పూర్తి పైకమునకు బిల్లు యిమ్మని గట్టిగా వాదించాడు. వర్తకుడు భయపడి, కంట్రోలురేటుకు మించి వసూలు చేసిన మొత్తాన్ని ఇచ్చివేశాడు. కాని అతడు తన మోసపు ప్రవర్తనను మానలేదు. 9-5-44 వ తేదీని పొట్లూరి వెంకటరత్నంగారు (గొల్లపల్లి)ఒక యినుప పలుగును కొనుక్కోడానికి వెళ్ళగా, యీ లైసెన్సుదారు కంట్రోలు రేటుకు మించి రు.10-13-0ఖరీదుచెప్పాడు. రైతు పలుగును తీసుకొని సొమ్ము ఇచ్చివేసి, రశీదు ఇమ్మని కోరాడు. లైసెన్సుదారు నిరాకరించడమేగాకుండా పలుగును బలవంతంగా లాక్కోబోయాడు. కాని రైతులొంగలేదు. చుట్టుప్రక్కల ఉన్నప్రజలు వచ్చి, లైసెన్సుదారుచేసే అక్రమాన్ని ఖండించారు. ఐనప్పటికీ లైసెన్సుదారు బిల్లు యివ్వక, యిద్దరుముగ్గురు వ్యాపారస్తుల్ని తీసుకొచ్చి, రైతు పలుగును దొంగతనంగా ఎత్తుకుపోతూన్నట్లు కేసు పెడతానని బెదరించాడు.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE